# పాలస్తీనా ముఖచిత్రం

(గాజాపై ఇజ్రాయిల్ దాడులు 2023-2024)



ప్రచురణ

**రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)**

AIKMKS అనుబంధం

# పాలస్తీనా ముఖచిత్రం

(గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం
2023 - 2024)

ప్రచురణ:

**రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)**

**AIKMKS** అనుబంధం

**పాలస్తీనా ముఖచిత్రం**
**(గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం 2023 - 2024)**

ప్రచురణ:
**రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)**
AIKMKS అనుబంధం

ప్రతులు : 500
వెల : రూ. 50/-

ప్రతులకు
మైత్రీబుక్ హౌస్
జలీల్ వీధి, కారల్‌మార్క్స్ రోడ్
విజయవాడ - 2.

**కా॥ ఎస్. ఝాన్సీ**
అధ్యక్షులు, రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)
తరిమెల నాగిరెడ్డి భవన్, న్యూ గిరిపురం, విజయవాడ
సెల్ : 9440319977.

*డిటిపి, లేఅవుట్ & కవర్ డిజైన్ :*
**అక్షర గ్రాఫిక్స్**
నల్లకుంట, హైదరాబాద్ - 44.

# ముందుమాట

మానవాళిని నిత్యం పీడించే ప్రధమ శత్రువు పేరే సామ్రాజ్యవాదం. గడచిన ఒకటిన్నర శతాబ్దంగా ఆఫ్రికా ఖండపు అణువణువునీ శోధించి, సకల వనరుల్నీ లూటీచేసి అత్యంత పేదరికంలోకి నెట్టివేయగలిగిందీ సామ్రాజ్యవాదం. ఆయిల్ వనరులు, ఖనిజ సంపదలు ఏ దేశంలో, ఏ ప్రాంతంలో వున్నా వాటిపై తమ ఆధిపత్యాన్ని కోరుకుంటున్నది. దేశం పట్ల ప్రేమతో ఆలోచించే వారందరూ దీన్ని తెలుసుకుంటే గానీ రేపటి ఆసియా ఖండం గురించి, అందులో భాగమైన భారతదేశపు సకల సంపదల పరిరక్షణ కోసం సామ్రాజ్యవాదంతో, దానికి సహకరించే దళారీ వర్గాలతో సాగించాల్సిన పోరాటం గురించి పూర్తిగా అర్థం కాదు.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ పోలీసుగా, పెద్దన్నగా అవతరించిన అమెరికన్ సామ్రాజ్యవాదం నేడు అన్ని దేశాల ప్రజలకూ అతిపెద్ద శత్రువుగా, యుద్ధాలకు పర్యాయపదంగా మారింది. తన నయా వలస విధానాలను విస్తరించుకుంటూ పోతున్నది. అది ఇంత క్రూరంగా దిగజారే క్రమంలో అనేక దేశాల్లో లక్షలాది మందిని భౌతికంగా బలితీసుకున్నది. ప్రకృతిని, పర్యావరణాన్ని సర్వనాశనం చేసింది. ఇరుగు పొరుగు దేశాలకు మొదట స్వచ్ఛంద ఆర్థిక సహాయం, ఆ తర్వాత ఆయుధాల సహాయం చేసి యుద్ధాలకు పురికొల్పింది. మార్కెట్ల వేట, డాలర్ ఫైనాన్స్ పెట్టుబడుల అంతర్జాతీయ వెతుకులాటలో భాగంగా అది ఎన్నో దారుణాలకు తెగబడింది. తన అనుకూల, వ్యతిరేక కూటములుగా ప్రపంచాన్ని విభజించింది. తమ ప్రయోజనాల కోసం ఎన్నో ప్రాదేశిక కూటములను నిర్మించింది. కొన్ని అంతర్జాతీయ సంస్థలను, వేదికలను ఏర్పరిచి వాటి విధానాలను, న్యాయ

సూత్రాలను ప్రతిపాదించింది. తన ప్రయోజనాలకు నష్టం అనుకున్న తక్షణం ఆ విధానాలనే తుంగలో తొక్కుతూ మనుగడ సాగిస్తూ వస్తున్నది.

రెండవ ప్రపంచయుద్ధంలో మిగిలిపోయిన రసాయనాలతో తయారుచేసే ఎరువులు, క్రిమిసంహారకాలకు మార్కెట్‌ను సృష్టించుకోవడం కోసం సస్యవిప్లవం పేరుతో శాస్త్రవిజ్ఞానాన్ని ఉపయోగించుకుంది. ఎరువులను, క్రిమిసంహారక మందులను ఎన్నో దేశాలకు ఎగుమతి చేసి క్రమంగా ఆయాదేశాల వ్యవసాయ, పారిశ్రామిక  రంగాలను చాలా వరకు కంట్రోల్‌లోకి తెచ్చుకోగలిగింది. వివిధ రంగాల్లో చేసే ప్రతి పరిశోధనలపైన, పెడుతున్న ప్రతి డాలర్ పెట్టుబడికి ఫలితంగా పేటెంట్లు, రాయల్టీలు పొందే ఆలోచన చేసింది. అంతర్జాతీయ వ్యాపారంలో తమ దేశ పెట్టుబడిదారీ వర్గానికి వందల రెట్లు లాభాలు తెచ్చిపెట్టేలా అన్ని దేశాల్లో విధానాలు చేయించుకోగలిగింది. ఈ క్రమంలో ఉనికిలోకి వచ్చిందే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అనే మార్కెట్ ఆధిపత్య విధానం.

పాత వలసవాద విధానంలో కొద్దిగా మార్పులు చేసుకున్న అమెరికా కొన్ని రిమోట్ కంట్రోల్ దేశాల్ని, తమ పూర్తి ఆదుపాజ్ఞలలో నడిచే ఇజ్రాయిల్ వంటి దేశాల్ని సృష్టించుకున్నది . ఇజ్రాయిల్‌లో జాత్యహంకారాన్ని  పెంచిపోషించి, వారికి నీడనిచ్చిన పాలస్తీనా ప్రజలపైనే అమానవీయ దాడుల్ని దశాబ్దాలుగా జరిపిస్తున్నది. ఈ దాడులు, మారణ హోమం గురించి చారిత్రక వాస్తవాలను ప్రపంచ ప్రజలంతా, ముఖ్యంగా విద్యార్థులు, యువతరం, రైతాంగం, పీడిత ప్రజలంతా సమగ్రంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది.  అమెరికన్ సామ్రాజ్యవాదులు తమ ప్రయోజనాల కోసం ఒక గూండా రాజ్యాన్ని ఎలా తయారు చేసారో, అన్యాయాలు, దారుణాలు చేయడమే వాళ్లకు ఒక బాధ్యతగా ఎలా కేటాయించారో అర్థం చేసుకోవాలంటే కొంత మేరకు చారిత్రక వాస్తవాలను నిష్పాక్షికంగా తెలుసుకోవాలి.

అంతర్జాతీయ స్థాయిలో ఒత్తిడులు వున్నప్పుడు, దేశాలపై నేరుగా చేయలేని దాడుల్ని ఎటువంటి జంకూ లేకుండా ఇజ్రాయిల్  దేశం చేత చేయించడం, దాడులు చేయిస్తామని బెదిరించడం అమెరికా సాగించింది. వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంలో పరిశోధనలను, వైద్య వ్యాపార పరిశోధనలను, ఆధునిక సైనిక పరిశోధనలను, ఆయుధ వ్యాపారాలను దశాబ్దాలుగా ఆ దేశంతో కలిసి సాగిస్తున్నది. తమ దేశాల్లో కొనసాగుతున్న పెట్టుబడిదారీ సంక్షోభాన్ని ఇతర  దేశాలపై రుద్దడం కోసం,  ప్రపంచ

ఆధిపత్యం కోసం యుద్ధాలు సృష్టిస్తూనే వుంది. చరిత్రలో ఇందుకు అనేక రుజువులున్నాయి.

ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య 2025, జనవరి 19 న జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం ఫలితంగా మూడు నెలలుగా కొంత మేరకు శాంతి నెలకొన్నది. ఆ ఒప్పందాన్ని కాలరాచి, మార్చి 18వ తేదీన ఇజ్రాయిల్ తిరిగి ప్రారంభించిన ఏకపక్ష దాడిలో ఒక్కరోజే 673 మంది మరణించారు. గత సంవత్సర కాలంలో గాజాలో మరణించిన 50 వేల మందిలో 15,600 మంది పిల్లలేనని పాలస్తీనా ఆరోగ్య శాఖ ప్రకటించింది. గాజాలో మారణహోమం మళ్లీ మొదలైంది. ఇకపై శాంతి చర్చలు మంటల్లోనే జరుగుతాయని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి ప్రకటించారు. లక్షలాదిమంది పాలస్తీనా పౌరులు మళ్ళీ తమ నివాసాలను వీడి వలసపోతున్నారు. ఎప్పటిలాగే ఎక్కువగా ఆసుపత్రులపైనే ఇజ్రాయిల్ క్రూరమైన దాడులు సాగిస్తుంది. వైద్య సహాయం చేస్తున్న డాక్టర్ల బృందాల్ని టార్గెట్ చేసి చంపి వారి వాహనాలు కూడా కనిపించకుండా పూడ్చివేస్తూ వుంది. ఆ దేశాధ్యక్షుడు నెతన్యాహు అంతర్గతంగా ఎదుర్కొంటున్న సంక్షోభం కూడా తాజా దాడులకు ఒకానొక కారణమైనప్పటికీ, అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత ఈ దేశాలలో జరుగుతున్న విధానపరమైన పరిణామాలే కీలకమైనవి.

సామ్రాజ్యవాద పెట్టుబడికి తమకు అవసరం వున్నంత వరకూ ప్రపంచీకరణ చాలా గొప్పదనీ, తిరుగులేనిదనీ ప్రచారం చేసారు. ఎవరు పండించిన పంటలైనా ఏ దేశంలోనైనా, ఎక్కడన్నా అమ్ముకోవచ్చు అన్న ఆకర్షణీయ నినాదాలు ఇచ్చారు. చాలా దేశాల ఉత్పత్తులు ఎగుమతి – దిగుమతుల చక్రవ్యూహం లోకి జారుకున్నాయని అనుకుంటున్న ఈ మూడు దశాబ్దాల తర్వాత ఇప్పుడు "కర్ర వున్న వాడిదే బర్రె" ఆయుధం వున్న వాడిదే ఆధిపత్యం' అంటున్నారు. ఒకపక్క ఆయుధాలతో బెదిరింపులు, మరొక పక్క ట్రేడ్ వార్ బెదిరింపులు. తాజాగా అమెరికా అధ్యక్షుని ప్రకటన రూపంలో ప్రపంచ దేశాలపై విధిస్తున్న కొత్త ఆంక్షలను, దిగుమతి సుంకాలను ఈ కోణంలోనే చూడాల్సి వుంటుంది. ఈ సరుకుల యుద్ధం పేరుతో ప్రపంచంలోని ప్రతి రంగాన్ని తమ కంట్రోల్‌లోకి తెచ్చుకుని, ప్రతి మనిషిని దోచుకోగాలుగుతామని అమెరికన్ సామ్రాజ్యవాదులు కలలు కంటున్నారు.

మారిన సామ్రాజ్యవాద దేశాల కూటముల సమీకరణాల వల్ల, 2023 అక్టోబర్‌లో పాలస్తీనా 'హమస్' చేసిన కొన్ని ప్రతిఘటన దాడుల వల్ల ఇజ్రాయిల్

క్రిమినల్ చరిత్రని కూడా సమర్థించడం పెరిగిందన్నది మనం గమనంలో వుంచుకోవాలి. ఏది ఏమైనా చారిత్రక వాస్తవాల ఆధారంగానే ఎవరైనా స్పష్టమైన అవగాహనకు రాగలుగుతారు. ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్యనే కాకుండా ఈ కాలంలోనే అనేక దేశాలపై ఏకపక్ష దాడులు, యుద్ధాలు జరుగుతూనే వున్నాయి. ఈ ఇజ్రాయిలే సిరియాపైన కూడా దాడులు చేసింది, ఇంకా చేస్తున్నది. ఒక సార్వభౌమాధికార దేశం పైన ఏ అగ్రరాజ్యం దాడిచేసినా అప్పుడు ఏర్పడే పరిస్థితులు ఆ దేశాలకు మాత్రమే పరిమితమై వుండిపోవు. ఆ యుద్ధ కంపం తీవ్రత డాలర్ స్కేలుపై పడి ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలా దేశాల ప్రజలు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. యుద్ధాల కారణంగా పెరిగే క్రూడాయిల్ వంటి ఇంధన ధరలను చూస్తున్నాం. ఫలితంగా పెరిగే ఉత్పాదక ఖర్చులు, గిట్టుబాటుకాని వ్యవసాయాలు, మూతబడే దేశీయ పరిశ్రమలు, పెరుగుతున్న నిరుద్యోగం … ఇటువంటి ఒకదానితో ఒకటి ముడిపడిన గొలుసు ప్రభావాలు ప్రతి దేశం ఎదుర్కుంటున్నవే.

అందుకే, సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచంలోని పీడిత దేశాల ప్రజలు తమ వుమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా స్పందిస్తున్నారు. న్యాయం ఎవరిదో అర్థం చేసుకుని, బాధితుల పక్షాన గొంతెత్తి నిలబడుతున్నారు. ఈ అంతర్జాతీయ సంఘీభావ ఉద్యమాలు ప్రపంచ శాంతి కోరుకునే వారికి కొత్తవేమీ కాదు. సామ్రాజ్యవాదం అంటేనే మార్కెట్ల యుద్ధం అని, అది ఓడించబడితేనే ప్రపంచంలో అసలైన శాంతి నెలకొంటుందని కామ్రేడ్ లెనిన్ ఏనాడో ప్రకటించాడు. ప్రపంచవ్యాప్తంగా నూతన ప్రజాస్వామిక భావనలు, సోషలిస్టు సామాజిక భావనలు పురోగమన దిశలో వున్న కాలంలో దురాక్రమణ యుద్ధాలను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సమాజపు సహకారం కొంత ఎక్కువగానే ప్రజలకు లభించేది. ఇప్పుడు కూడా గాజా ప్రజలకు సంఘీభావంగా విద్యార్థులు, యువత, శ్రమజీవులు, మేధావులు ప్రపంచవ్యాప్తంగా స్పందిస్తున్న తీరు కొంత ఆశాజనకంగానే వుంది. తమ దేశ పాలకుల విధానాలు, ఆంక్షలపై అమెరికాలోనూ, ఇజ్రాయిల్‌లో కూడా పెద్దఎత్తున నిరసనలు తెలియజేస్తున్నారు. తమ తమ దేశాల ప్రభుత్వాలు అవలంభించే అంతర్జాతీయ విధానాల్లోని మంచి చెడుల్ని విశ్లేషించుకోవడానికి ఈ స్పందనలు ఆ ప్రజలకు ఉపయోగపడతాయి.

పాలస్తీనాపై సంవత్సర కాలం పాటు ఇజ్రాయిల్ చేసిన దాడుల గురించి ఈ చిన్న పుస్తకంలో కొన్ని వివరాలు స్పష్టంగా వున్నాయి. వివిధ దశల్లో జరిగిన

చారిత్రక ఒప్పందాలు, వాటి వెనక వున్న కారణాలు, అమెరికా ప్రయోజనాలు చాలా వివరంగా ఇందులో వున్నాయి. ప్రధాన మీడియాగా చెప్పబడుతున్న పెట్టుబడిదారీ అనుకూల మీడియాలో వచ్చే ఏకపక్ష సమాచారాన్ని మాత్రమే చూసి, విని, పూర్తిగా తెలుసుకోలేని వారికి, ముఖ్యంగా కొన్ని ముందస్తు పొరపాటు అభిప్రాయాలతో వుండే వారికి ఈ పుస్తకం వాస్తవాలను తెలియజేస్తుంది.

వివిధ వర్గాల ప్రజలకు, రైతాంగానికి ఉపయోగ పడుతుందని ఈ చిన్న పుస్తకాన్ని ప్రచురిస్తున్నాము. ఈ బుక్‌లెట్‌లో వున్న విషయాలతోపాటు ఇటీవలి దాడుల అనంతర పరిణామాలను కూడా అర్థం చేసుకొని పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా నిలవాలని కోరుతున్నాం. సామ్రాజ్యవాదులు, వారి తొత్తులు ఏ పీడిత దేశం పైన దాడులు చేసినా, ఏకపక్ష ఆంక్షలు విధించినా మానవాళి మంచికోసం, సమాజ పురోగమనం కోసం స్పందించాలని ప్రజలందరినీ కోరుతున్నాం.

6-4-2025,

**– రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)**

(AIKMKS అనుబంధం)

# గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం (2023 - 2024)

**(ఈ వ్యాసం డిసెంబర్ 2024 లో తయారు చేయబడింది. అందువల్ల పేర్కొన్న గణాంకాలు ఆ కాలానికి చెందినవి)**

## 1. కలచివేసే వాస్తవం:

గత సంవత్సర కాలంగా రోజూ టీవీలలో వచ్చే కొన్ని హృదయవిదారక దృశ్యాలు మనల్ని కలచివేస్తున్నాయి. భయానక బాంబుపేలుళ్ల కారణంగా అగ్నికి ఆహుతి అవుతున్న భవనాలు, దట్టమైన పొగలతో కప్పబడిన ఆకాశం, రోడ్లు అనబడే వాటికి ఇరువైపులా శిథిలాలు, ఆ శిథిలాల మధ్యలో అతి కష్టం మీద తిరుగుతున్న అంబులెన్సులు, తీవ్రంగా గాయపడిన వారిని చేతుల్లో మోసుకొని ఆసుపత్రులకు పరిగెడుతున్నవారు, శవాలయ్యి తెల్లనిగుడ్డలతో చుట్టివేయబడినవారు; పిల్లలు, పురుషుల మృతదేహాలపై బుర్ఖా ధరించిన మహిళల రోదనలు; అమ్మా నాన్నలు చంపబడి, ఇళ్లు నాశనం చేయబడి ఒంటరిఅయ్యి ఎటువెళ్లాలో తెలియక తిరుగుతున్న చిన్న పిల్లలూ; తుపాకులతో కాల్పులు జరుపుతూ, బెదిరిస్తూ, అమాయకులను మానవ రక్షణ కవచాలుగా వాడుతూ తిరుగుతున్న సైనికులు; సరిహద్దుల వద్ద పంపిణీ చేస్తున్న గంజి కోసం గుమిగూడిన పిల్లలు; ప్రార్థనా స్థలాల చుట్టూ పగిలిన అల్యూమినియం గిన్నెలతో వున్న అమాయక పిల్లలు, ప్లాస్టిక్ డబ్బాలతో నీటిని మోసుకెళ్తున్న పిల్లలు; తల్లుల నుంచి ఏదోఒకటి పట్టుకుని మింగడానికి ప్రయత్నించే పసిబిడ్డలను మనం చూస్తున్నాం. బాంబులు, ప్రాణభయంతో పురుషులు, మహిళలు, పిల్లలు, యువకులు స్వంత ఊళ్లను విడిచి బ్రతికుంటే చాలు అని తమ వస్తువులతో (వారు కట్టి తీసుకెళ్లగలిగేవి) పారిపోవడం; నిస్సహాయ స్థితిలో వున్న ప్రజలు, వారి అరకొర నిత్యావసరాలతో నిండిన బండ్లు, అప్పుడప్పుడు ట్రక్కులు "సురక్షిత ప్రదేశాలను" వెతుక్కుంటూ రోడ్లపై తిరగడాన్ని మనం చూస్తున్నాము.

2023 అక్టోబర్ నుంచి 425 రోజులుగా పాలస్తీనాలోని గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ యుద్ధం ఫలితంగా టీవీలలో ఈ భయానక దృశ్యాలను చూస్తున్నాం. వాస్తవానికి,

అన్ని టీవీ ఛానళ్లు వీటిని చూపించవు. ఎందుకంటే వాటిలో చాలావరకు పూర్తిగా "ప్రచార ఛానళ్లు". అల్ జజీరా, కొన్ని ఫ్రెంచ్, ఆసియా టీవీ ఛానళ్ల గురించి ఇక్కడ ప్రస్తావించాలి. వాటి జర్నలిస్టులు ఇన్నిరోజులు రాత్రింబవళ్లు ఎంతో సాహసంతో, చిత్తశుద్ధితో పనిచేసి ఈ వార్తలను మనకు అందించారు. అద్భుతమైన వాస్తవిక రిపోర్టింగులో 'అల్ జజీరా' ను ప్రత్యేకంగా పేర్కొనాలి. గాజా యుద్ధంపై అంతర్జాతీయ నిరసనలు, తమ ప్రధానికి వ్యతిరేకంగా ఇజ్రాయెల్‌లో జరుగుతున్న నిరసనలు, ఇజ్రాయెల్ క్రూరత్వంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశాలు – మధ్య మధ్యలో మనకు చూపించడం జరిగింది.

2023 అక్టోబర్ 7 నుంచి గాజాపై ఇజ్రాయెల్ ప్రకటించిన తాజా యుద్ధంపై ఈ కవరేజీ అంతా వుంది. 425 రోజుల యుద్ధం తర్వాత పరిస్థితిని పరిశీలిస్తే...

- ❖ గాజాలో 44,750 మంది మరణించారు.
- ❖ 4,06,000 మంది గాయపడ్డారు, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.
- ❖ జూలై 2024 వరకు చంపబడిన వారిలో 70 శాతం మంది మహిళలు, పిల్లలే (ఇటీవల ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంస్థ నిర్వహించిన స్వతంత్ర దర్యాప్తులో నిర్ధారించారు).
- ❖ గాజాలో 180 మంది జర్నలిస్టులు, మీడియా కార్యకర్తలు మరణించారు.
- ❖ గాజాలో విధులు నిర్వర్తిస్తున్న 233 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బంది మరణించారు.
- ❖ 1000 మందికి పైగా వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది మరణించారు.
- ❖ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ లో సుమారు 750 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ సైన్యం (ఇకపై ఐడిఎఫ్), అక్రమ ఇజ్రాయిల్ సెటిలర్లు కలిసి చంపారు.
- ❖ వెస్ట్ బ్యాంక్ లో ఇజ్రాయిల్ దళాలు సుమారు 11,500 మంది పాలస్తీనియన్లను నిర్బంధించారు. గాజాలో అరెస్టులు లేవు, కాల్పులు, హత్యలు మాత్రమే వున్నాయి.
- ❖ లెబనాన్ లో సుమారు 4,500 మంది మరణించారు. ఇది అక్టోబర్ 2024 నుండి ఐడిఎఫ్ వైమానిక, భూ దాడులకు తాజా లక్ష్యంగా మారింది.
- ❖ లెబనాన్ లో సుమారు 13,000 మంది గాయపడ్డారు. వీరిలో చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఇప్పటిదాకా పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేసిన ఏ యుద్ధం మారణకాండ లోని ఏ సంఖ్యతోనూ ఇది సరితూగదు. అంతటి మారణహోమం ఇప్పుడు జరుగుతోంది. వీటిని అంకెలుగానే చూస్తే ఆ మారణహోమం మనకు అర్థంకాదు. హత్యకు గురైన ప్రతి సంఖ్య ఒక వ్యక్తి అయి వుండాలి. ప్రపంచంలోని ఏ దేశంలోని వ్యక్తి లానే తనూ పెరిగి వుంటారు. తన కష్టంతో కుటుంబాన్ని పోషించుకుంటుంటారు. ప్రపంచంలోని అందరిలాగే తనకూ ఇల్లు, పిల్లలు, వారి భవిష్యత్తుపై ఆకాంక్షలూ వుంటాయి. తను హత్యకు

ముందు, మీలా, నాలా రోజువారీ జీవితంలోని సాధారణ దినచర్యను కలిగి వుంటారు. తినడం, పనిచేయడం, నిద్రపోవడం, ఆడటం, విశ్రాంతి తీసుకోవడం. కాసేపు ఆలోచించండి! మీ ఇల్లు కూలిపోతున్నట్లయితే, మీరు, మీ కుటుంబం ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని పరిగెడుతుంటే, మీ పిల్లలు సహాయ కేంద్రం నుండి గంజి కోసం అర్రులు చాస్తూంటే/కష్టపడుతుంటే, మీరు తెగిపడిన అవయవాలతో తీసుకెళ్లబడుతుంటే....... ఇలాంటి ఓ దృశ్యం కళ్లముందు కనబడితే, అప్పుడు విషాదం యొక్క మొత్తం లోతు, తీవ్రత అర్థమవుతుంది.

ఇదంతా అక్టోబర్ 7, 2023 నుండి 450 రోజులకు పైగా ఇజ్రాయెల్ క్రూరంగా నిర్వహిస్తున్న "జెనోసైడ్" కారణంగా జరిగింది. జెనోసైడ్ ను "పెద్ద సమూహాల, ముఖ్యంగా ఒక నిర్దిష్ట జాతి ప్రజల హననం" గా నిర్వచించారు. గత 450 రోజులుగా గాజాలో ఇజ్రాయెల్ సరిగ్గా ఇదే చేస్తోంది.

ఇది 'ఆత్మరక్షణ' చర్య అనీ, 2023 అక్టోబర్ 7 న సరిహద్దులోని దక్షిణ ఇజ్రాయెల్ గ్రామాలపై హమాస్ చేసిన దాడి దీనికి కారణమని ఇజ్రాయెల్ పేర్కొన్నది. అవును. ఆ రోజు హమాస్ తీవ్రవాదులు ఇజ్రాయెల్‌లోని కొన్ని సరిహద్దు ప్రదేశాలపై దాడిచేసి 1,139 మందిని (పౌర, సైనిక సిబ్బందితో సహా) చంపారు అనేది నిజం. ఆ రోజు హమాస్ 251 మంది బందీలను తీసుకుంది. వారిలో 120 మంది ఇప్పటికీ నిర్బంధంలో వున్నారు. అది విషాదకరమైంది. కానీ చూడండి! IDF, ఇజ్రాయెల్ 'ఆత్మరక్షణ' ప్రతిస్పందన స్థాయి, 9/11 సంఘటనల తరువాత USA దాడుల కంటే చాలా ఘోరంగా వుంది.

పాలస్తీనాలోని పవిత్ర స్థలాలపై దాడులు చేయడం, అపవిత్రం చేయడం వంటి రెచ్చగొట్టే చర్యలు, ముఖ్యంగా నెతన్యాహు ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వంలో యూదు పవర్ పార్టీ నాయకుడు , జాతీయ భద్రతా మంత్రి ఇటామర్ బెన్–గ్వీర్ (అతని తీవ్ర జాత్యహంకార చర్యలు, ప్రేరేపణలతో అతను నిజంగా ఇజ్రాయెల్ జాతీయ భద్రతకు అతిపెద్ద ముప్పు) చర్యలకు ప్రతిస్పందనగా తమ చర్య వుందని హమాస్ పేర్కొంది. వాస్తవానికి, ఇజ్రాయెల్‌లో అధికారంలో వున్న నెతన్యాహు, ఇతరులు తక్కువ జాత్యహంకారులు కాదు, తక్కువ నేరస్థులు కాదు.

ఇజ్రాయెల్ తన 'ప్రతిస్పందన' యుద్ధాన్ని ప్రారంభించిన కొన్ని నెలల తరువాత ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ తన అధికారిక ప్రసంగంలో "హమాస్ చర్య శూన్యంలో జరగలేదు" అని అన్నారు. ఈ ప్రకటన – గాజాలో ఏమి జరుగుతుందో, దానికి హమాస్ ను మాత్రమే బాధ్యులుగా చేస్తూ ఇజ్రాయెల్, అమెరికా, పాశ్చాత్య దేశాలు విడుదల చేసే ప్రచారానికి వ్యతిరేకంగా, కొంతవరకు వాస్తవిక అంతర్జాతీయ ప్రతిస్పందనకు నాంది పలికింది.

ఈ సందర్భంలో ఇజ్రాయెల్ పాలస్తీనియన్ల జాతి హననాన్ని 2023 అక్టోబర్ 7న ప్రారంభించలేదని, 1947 నాటికే మొదలు పెట్టిందని గ్రహించడానికి ఈ వివరాలు చూద్దాం.

## 2 . ఇజ్రాయెల్ సృష్టి, పాలస్తీనా 'నక్బా' :

### 2.1 బ్రిటిష్ పెత్తనం (మాండేట్) :

ఉస్మాన్ 'ఒట్టోమన్' సామ్రాజ్యాన్ని (1299–1922) నెలకొల్పాడు. కాన్‌స్టాంట్ నోపుల్ (ఆధునిక ఇస్తాంబుల్) దాని రాజధానిగా వుండేది. దీనిని వ్యవహారికంగా టర్కిష్ సామ్రాజ్యం అని పిలిచేవారు.

ఒట్టోమన్ సామ్రాజ్యం 1914 మొదటి ప్రపంచ యుద్ధంలో మిత్రరాజ్యాల (ఆలీస్) శక్తులకు (రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్ , ఇటలీ) వ్యతిరేకంగా కేంద్ర శక్తుల (జర్మనీ, ఆస్ట్రియా – హంగరి) పక్షాన చేరి ఓడిపోయింది. 1918–1922 సమయంలో విభజించబడింది. WWI తర్వాత సామ్రాజ్యంలోని కొన్ని భాగాలు – టర్కీ (జాతీయ ప్రతిఘటన ఉద్యమం తరువాత), సౌదీ అరేబియా, యెమెన్ రాజ్యాలుగా మారాయి.

లీగ్ ఆఫ్ నేషన్స్ – ఫ్రెంచ్ పెత్తనాన్ని (మాండేట్) సిరియా, లెబనాన్ లపైబీ బ్రిటిష్ మాండేట్‌ను ఇరాక్, పాలస్తీనా, ట్రాన్స్ జోర్డాన్లపై రుద్దింది. బ్రిటిష్ మాండేట్ 1923లో అధికారికంగా అమలులోకి వచ్చింది. ఒడంబడిక ఆర్టికల్ 22 ప్రకారం (మాండేట్ సృష్టించడం) "గతంలో టర్కిష్ సామ్రాజ్యానికి చెందిన కొన్ని సమూహాలు స్వతంత్ర దేశాలుగా వారి ఉనికిని తాత్కాలికంగా గుర్తించబడే స్థాయికి అభివృద్ధి చెందాయి. వారు ఒంటరిగా నిలబడగలిగే సమయం వరకు మాండేట్ ద్వారా పరిపాలనా సలహాలు, సహాయాన్ని అందించాలి".

ఈ ఆదేశంతో పాలస్తీనా, బ్రిటన్‌తో జతచేయబడింది. 1920 లో బ్రిటిష్ ప్రభుత్వం లీగ్ ఆఫ్ నేషన్స్‌కు ఇచ్చిన తాత్కాలిక నివేదిక ప్రకారం, పాలస్తీనా జనాభా 7,00,000గా వుంది. వీరిలో 4,80,000 మంది ముస్లింలు, 77,000 మంది క్రైస్తవులు, 76,000 మంది యూదులు (అంటే ఇప్పుడున్న లక్షలాది యూదులు అందరూ గత 40 సంవత్సరాలలో పాలస్తీనాలో ప్రవేశించారు).

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత దోపిడీలను పంచుకునే సమయంలో, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ వలసరాజ్యాల ఆటను ఆడారు. వారు పాలస్తీనాలో యూదు జాతికి ఒక రాజ్యాన్ని సృష్టిస్తామని వాగ్దానం చేశారు. ఇదే అపఖ్యాతి పాలైన "1917 నాటి బాల్ఫోర్ డిక్లరేషన్".

"పాలస్తీనాలో యూదుల జాతీయ నివాస స్థాపనకు అనుకూలంగా గౌరవప్రదమైన బ్రిటీషు ప్రభువు వున్నారని, ఈ లక్ష్యాన్ని సాధించడానికి తమ ఉత్తమ ప్రయత్నాలను

ఉపయోగిస్తామని" యుకె విదేశాంగ కార్యదర్శి, లార్డ్ బాల్ఫోర్, వరల్డ్ జియోనిస్ట్ ఆర్గనైజేషన్‌కు వ్రాశారు.

వారి ఉద్దేశాలు ఎలా వున్నప్పటికీ, ఈ ప్రకటన పాలస్తీనా దేశాన్ని, దాని ప్రజలను త్వరలో చుట్టుముట్టే అంతులేని సంఘర్షణకు తలుపులు తెరిచింది. యుద్ధానంతర పంపకాలలో ఫ్రెంచివారిపై పైచేయి సాధించడం; ఈజిప్ట్, సూయజ్ కెనాల్ మరియు భారతదేశానికి వెళ్లే మార్గాన్ని గుప్పిట్లో పెట్టుకోవడానికి పాలస్తీనాను వ్యూహాత్మక స్థానంగా ఉపయోగించకోవాలని బ్రిటన్ పన్నిన పన్నాగం.

రచయిత ఆర్థర్ కోస్టర్ దీనిని "ఒక దేశం రెండవ దేశానికి మూడవ దేశాన్ని గంభీరంగా వాగ్దానం చేసింది" అని చమత్కరించారు!

1928 వరకు బ్రిటిష్ ప్రభుత్వం పాలస్తీనాను బ్రిటిష్ ప్రభావ పరిధిలో ఒక రాజ్యంగా పరిగణించింది. ఒక కాలనీగా కాదు. 1947 ఫిబ్రవరిలో పాలస్తీనాను విడిచిపెట్టి, పాలస్తీనా ప్రశ్నను ఐక్యరాజ్యసమితికి బదిలీ చేయాలని బ్రిటన్ నిర్ణయించింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, యూరప్ తన గడ్డమీద యూదులపై చేసిన హెూలోకాస్ట్ (మానవ హననం) కు పరిహారంగా పాలస్తీనాలో యూదు రాజ్యాన్ని నెలకొల్పడానికి సిద్ధమైంది. అదే సమయంలో స్థానిక పాలస్తీనియన్లకు జరిగిన ఘోరమైన అన్యాయాన్ని విస్మరించి మరింత రావణ కాష్టంలోకి నెట్టింది. 1947లో ఇజ్రాయెల్ ఏర్పాటు గురించి మాట్లాడేముందు, 1947 తరువాత ఏం జరిగిందీ అని అర్థం చేసుకోవడానికి బ్రిటిష్ మాండేట్ కాలంలో జరిగిన చాలా ముఖ్యమైన మార్పులు, సంఘటనలను గమనించాలి.

**2.2 యూదుల వలసలు, విస్తరణ :**

పాలస్తీనాలో క్రైస్తవ మతం, జుడాయిజం, ఇస్లాం అనే మూడు మతాలకు పవిత్ర స్థలాలు వున్నాయి. ఈ గొప్ప చారిత్రక వారసత్వం ప్రస్తుత స్వదేశీ ప్రజలకు శాపంగా మారింది. జెరూసలేం, బెత్లేహేం శతాబ్దాలుగా గొప్ప పుణ్యక్షేత్రాలు. "ఎరెట్జ్ ఇజ్రాయెల్" అనేది యూదుల మతంలో పాలస్తీనాకు పేరు. ఇది తరతరాలుగా యూదులకు పవిత్ర తీర్థస్థలంగా వుండేది. కానీ పౌరాణికంగా, చారిత్రకంగా వారి స్వంత భూమిగా ఎప్పుడూ లేదు.

కొంతమంది యూదులు 20 వ శతాబ్దం ప్రారంభంలో పాలస్తీనాకు వలస వచ్చారు. ఒట్టోమన్ రాజ్యం చివరికాలంలో ఐరోపా నుండి నిరుపేదలుగా వచ్చిన యూదులను పాలస్తీనియన్లు తమతో వుండమని ఆహ్వానించారు.

కానీ, 1901లో స్థాపించబడిన యూదు నేషనల్ ఫండ్ (జెఎన్ఎఫ్), పాలస్తీనాలోకి యూదు వలసలు ఇబ్బడి ముబ్బడిగా ప్రవేశించడానికీ, పాలస్తీనాను ఏకంగా యూదుల వలసరాజ్యంగా మార్చడానికి ప్రధాన కారణమైంది. పాలస్తీనా భూములను కొనుగోలు చేయడానికి, యూదు వలసదారులను స్థిరపరచడానికి జెఎన్ఎఫ్ ధనవంతులైన ప్రవాస

యూదులకు నిధులు సమకూర్చింది. సంపన్న భూస్వామ్య అరబ్బులు ఎటువంటి దూరదృష్టి లేకుండా వేల ఎకరాల భూమిని యూదులకు విక్రయించారు. ఆ విధంగా, బ్రిటన్ మాండేట్ కాలానికే యూదు వలసదారులు గణనీయమైన మైనారిటీగా మారారు.

బాల్ఫోర్ ప్రకటనతో పాలస్తీనాలోకి యూదుల వలస వరదలా మారింది. పాలస్తీనాను నియంత్రించడానికి బ్రిటిష్ మాండేట్ యూదులతో కుమ్మక్కు అయ్యి, యూదు వలసలను ప్రోత్సహించింది.

వలసదారుల అసలు ఉద్దేశాలు అర్థమవుతుండడంతో క్రమంగా బ్రిటీష్ ప్రభుత్వం పైనా, వలసదారులపైనా పాలస్తీనా ప్రజల వ్యతిరేకత పెరిగింది. దీని ఫలితంగా 1929లో బ్రిటన్‌కు వ్యతిరేకంగా పాలస్తీనా తిరుగుబాటు జరిగింది. 1933 నుండి 1936 వరకు పాలస్తీనా గ్రామీణ ప్రాంతాలపై క్రూరమైన, పాశవిక దాడులతో బ్రిటీష్ సైన్యం ఆ తిరుగుబాటును అణచివేసింది. చాలామంది గ్రామస్తులను అరెస్టు చేసి చంపారు. పాలస్తీనా నాయకత్వం ప్రవాసంలో తలదాచుకోవాల్సి వచ్చింది. గెరిల్లా యుద్ధం నిర్వహిస్తున్న పారామిలిటరీ యూనిట్లు నిర్వీర్యం చేయబడ్డాయి. (పాలస్తీనా నాయకత్వం, పోరాట విభాగాలు లేకపోవడం వల్ల 1947, 1948 నాటికి పాలస్తీనా గ్రామాలపై యూదులకు పైచేయి దక్కింది).

మరో పక్క, బ్రిటిష్ వారు వెళ్ళిపోయిన తరువాత పాలస్తీనాను యూదు వలసరాజ్యం చేయడానికి యూదులు రహస్య ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. పాలస్తీనా తిరుగుబాటును అణచివేయడంలో, రెండవ ప్రపంచ యుద్ధంలో వారు బ్రిటీష్ వారికి సహకరించారు. బెన్-గురియన్, యూదుల ప్రణాళికలకు నాయకుడు. తర్వాతికాలంలో పాలస్తీనియన్ల జాతి హననానికి సూత్రదారుడు (బెన్-గురియన్ అనేకవిధాలుగా ఇజ్రాయెల్ దేశ వ్యవస్థాపకుడు, దాని మొదటి ప్రధానమంత్రి). జ్యూయిష్ ఏజెన్సీ (పాలస్తీనాలోకి యూదు వలసలను ప్రేరేపించే ఒక స్వచ్ఛంద సంస్థ) "హగానా" ("రక్షణ" అని అర్థం) అనే పారామిలిటరీ సంస్థను పాలస్తీనాలో సృష్టించింది. ఇది త్వరలోనే జ్యూయిష్ ఏజెన్సీ మరియు జ్యూయిష్ కన్సల్టెన్సీ యొక్క సైనిక విభాగంగా మారింది. "ఇర్గున్", "స్టెర్న్ గాంగ్" అని పిలువబడే మరో రెండు తీవ్రవాద సమూహాలు పనిచేశాయి. పాలస్తీనియన్ల జాతి నిర్మూలనకు 1941 లో "పాల్మచ్" అనే ప్రత్యేక కమాండో యూనిట్ స్థాపించబడింది.

బ్రిటీష్ వారు యూదు ఏజెన్సీకి రెండు విధాలుగా సహాయం చేశారు. మొదటిది: సైనిక సంస్థలను నిర్మించడానికి, వారికి శిక్షణ ఇవ్వడానికి. రెండవది: 1936 తిరుగుబాటును అణచివేసినప్పుడు పాలస్తీనా నాయకత్వాన్ని, దాని రక్షణ సామర్థ్యాలను నాశనం చేయడం. ఈ సహాయం ద్వారా యూదులు పాలస్తీనియన్ల జాతిని హననం చేయడానికి వీలు కల్పించింది.

## 2.3 పాలస్తీనా జాతి నిర్మూలనకు, యూదు వలసరాజ్య స్థాపనకు సన్నాహాలు :

జాతి హననం అనేది ఒక నిర్దిష్ట వ్యక్తుల సమూహం మరొక సమూహాన్ని జాతి,

మతం, మొదలైన వాటి ఆధారంగా వారి భూభాగం నుండి క్రమపద్ధతిలో తొలగించడం. ఇటువంటి విధానం హింసను కలిగి వుంటుంది. చాలా తరచుగా సైనిక కార్యకలాపాలతో ముడిపడి వుంటుంది. ఇందులో సామూహిక హత్యాకాండలు ఒక భాగమైతే, ఇది సృష్టించిన ద్వేషం ఫలితంగా ప్రణాళికేతర సామూహిక హత్యలు విరివిగా జరుగుతాయి. రాజకీయ నాయకత్వం జాతి హనన అమలును సైనిక లేదా మూకలకు అప్పగిస్తుంది.

1947 కి ముందు యూదు నాయకత్వం లక్ష్యం పాలస్తీనా అంతటా యూదు రాజ్యాన్ని స్థాపించడం. అలా జరగాలంటే, వారు స్థానిక అరబ్బులైన పాలస్తీనా జనాభాలో 80 నుండి 90 శాతం మందిని తీసివేయాలి. అందువల్ల, వారు జాతి హననాన్ని ఆశ్రయించారు. జియోనిస్టులు (జాత్యహంకార యూదులు) రెండు విధాలుగా ఈ పనిని ముందుకు తీసుకువెళ్లారు. ఒకటి: హింసాత్మక సాయుధ మూకలను సృష్టించడం, రెండవది: పాలస్తీనా గురించి మొత్తం సమాచారాన్ని గూఢచార వ్యవస్థల ద్వారా సేకరించడం.

**గ్రామ ఫైళ్లు:** జియోనిస్ట్ నిపుణులు 1930 ల నాటికి పాలస్తీనాలోని ప్రతి గ్రామానికి సంబంధించిన వివరణాత్మక ఫైళ్లను రూపొందించారు. ప్రతి గ్రామ నైసర్గిక వివరాలు, దాని స్వభావ స్వరూపాలు, ప్రవేశ దారులు, భూమి నాణ్యత, నీటి బుగ్గలు, ప్రధాన ఆదాయ వనరులు, దాని సామాజిక-రాజకీయ కూర్పు, ముక్తర్ల (గ్రామ పెద్ద) పేర్లు, ఇతర గ్రామాలతో దాని సంబంధం, పురుషుల వయస్సు , మరెన్నో వివరాలు నమోదు చేయబడ్డాయి. 1936 తిరుగుబాటులో గ్రామం ఏ స్థాయిలో పాల్గొన్నదో అన్న దానిని బట్టి జియోనిస్ట్ ప్రాజెక్ట్ పట్ల "శత్రుత్వ" వైఖరా, కాదా? అనే సూచీ పట్టిక తయారు చేసింది. తిరుగుబాటులో పాల్గొన్న ప్రతి ఒక్కరి జాబితా, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటంలో ఒకరిని కోల్పోయిన కుటుంబాల జాబితా చేయబడింది. యూదులను చంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

1943 తరువాత, ఈ ఫైళ్ళలో వ్యవసాయం, సాగు భూమి, తోటలలోని చెట్ల సంఖ్య, ప్రతి పండ్ల తోట నాణ్యత, ప్రతి కుటుంబానికి సగటు భూమి, కార్లు, దుకాణాలు, వర్క్ షాపులు, చేతివృత్తులవారి పేర్ల గురించి వివరాలు కూడా సేకరించారు. రాజకీయంగా ఏ పక్షం వైపు, కులీనులు -సామాన్య రైతుల మధ్య సామాజిక అంతరాలు, మాండేట్ ప్రభుత్వంలో అధికారులుగా పనిచేస్తున్న వారి గురించి ఖచ్చితమైన వివరాలు జోడించబడ్డాయి.

విలేజ్ ఫైల్స్ చివరి నవీకరణ 1947 లో జరిగింది. ఇది పాలస్తీనా జాతీయ ఉద్యమంలో పాలస్తీనా ఉద్యమ నాయకుడైన ముఫ్తీ అల్-హాజ్ అమీన్ అల్-హుస్సేనీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండటం, బ్రిటిష్, జియోనిస్టులకు వ్యతిరేకంగా చర్యలలో పాల్గొనడం వంటి ప్రమాణాల ఆధారంగా ప్రతి గ్రామంలో 'వాంటెడ్ వ్యక్తుల' జాబితా సృష్టిపై దృష్టి పెట్టింది.

ఐక్యరాజ్యసమితి పాలస్తీనా విభజన ప్రణాళిక తీర్మానం తరువాత 1947–48లో ఈ విలేజ్ ఫైల్స్ సమాచారంతో జియోనిస్టు పాలస్తీనా గ్రామాలపై అత్యంత పాశవిక దాడులకూ, దుర్మార్గాలకు ఒడిగట్టారు. ఈ మారణహోమాన్నే పాలస్తీనీయుల అరబ్బు బాషలో 'నక్బా' అంటారు.

## 2.4 పాలస్తీనా విభజన, ఇజ్రాయెల్ దేశ ఏర్పాటుపై ఐక్యరాజ్యసమితి తీర్మానం :

బ్రిటిష్ వారు తాము సృష్టించిన సమస్యను తమ కుయుక్తులకు అనుగుణంగా కొనసాగించడానికి అప్పుడే ఏర్పడిన, అనుభవం లేని ఐక్యరాజ్యసమితి (యుఎన్) కి బదిలీ చేశారు. ఐక్యరాజ్యసమితి పాలస్తీనాపై ఒక ప్రత్యేక కమిటీని (UN-SCOP) ఏర్పాటు చేసింది. ఇది ఇజ్రాయెల్, పాలస్తీనా రెండు దేశాలను స్థాపించాలని సిఫారసు చేసింది. యూదులు పాలస్తీనా మొత్తాన్ని తమ దేశంగా హస్తగతం చేసుకొందాం అనుకొన్నారు. ఐక్యరాజ్యసమితి విభజన ప్రణాళిక, 56 శాతం భూమిని జనాభాలో తక్కువగా వున్న వలసల ద్వారా వచ్చిన ఇజ్రాయెల్ కు, 42 శాతం పాలస్తీనాకు, మిగిలిన జెరూసలేంను ఐక్యరాజ్యసమితి నియంత్రణలో అంతర్జాతీయ నగరంగా కేటాయించింది. పాలస్తీనాను రెండు విడి భాగాలు– వెస్ట్ బ్యాంక్, గాజాగా నిర్ణయించింది.

అరబ్ లీగ్ (ప్రాంతీయ అరబ్‌దేశాల సంస్థ), అరబ్ హయ్యర్ కమిటీ (పిండదశలోని పాలస్తీనా ప్రభుత్వం) UN-SCOP తో చర్చలను బహిష్కరించాలని నిర్ణయించి, UN ప్రణాళిక అమలు చర్చలలో పాల్గొనలేదు.

1947 నవంబర్ 29 న ఐక్యరాజ్యసమితి తన విభజన తీర్మానాన్ని ఆమోదించింది. అదే ఐక్యరాజ్యసమితి – జనరల్ అసెంబ్లీ 181వ తీర్మానం. ఈ తీర్మానం ప్రకారం, పాలస్తీనా 8,18,000 మంది పాలస్తీనియన్లు , 10,000 మంది యూదులతో; ఇజ్రాయెల్ కూడా 4,99,000 యూదులు, 4,38,000 పాలస్తీనియన్లతో విభజించబడ్డాయి. 2,00,000 జనాభాతో పాలస్తీనియన్లు, యూదుల మధ్య సమానంగా విభజించబడిన జెరూసలేం ఒక చిన్న ఎన్క్లేవ్ గా వుండాల్సి వుంది.

పాలస్తీనాను ఈ విధంగా విభజించడం ద్వారా, విభజన తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసిన UN సభ్యులు జరగబోయే నేరానికి నేరుగా దోహదపడ్డారు. ఐక్యరాజ్యసమితి వారు ఎవరి భూమిని విభజించారో వారిని విడిచిపెట్టింది. వారి సంక్షేమాన్ని, జీవితాలను 19వ శతాబ్దం చివరి నుండి వారిని నిర్మూలించ చూస్తోన్న, వారి మాతృభూమిని స్వాధీనం చేసుకోవాలని చూస్తోన్న యూదులకు అప్పగించింది. ఐక్యరాజ్యసమితి విభజన తీర్మానానికి అమెరికా, సోవియట్ యూనియన్ మద్దతు అరబ్ జనాభా ఆకాంక్షలతో సంబంధం లేకుండా ఇజ్రాయెల్ దేశ స్థాపనకు చట్టబద్ధతను ఇచ్చింది.

ఇజ్రాయెల్ వ్యూహం పాలస్తీనాలోని అత్యధిక ప్రాంతంలో సాధ్యమైనంత తక్కువ అరబ్ మైనారిటీతో తమ రాజ్యాన్ని సాధించడం. అందువల్ల, ఇది ఐక్యరాజ్యసమితి విభజన

ప్రణాళికను వ్యూహాత్మకంగా అంగీకరించి, వెంటనే దాని వ్యూహాన్ని అమలు చేయడానికి మార్గాలను కనుగొనడం ప్రారంభించింది. 1948 మే 14న ఇజ్రాయెల్ స్వాతంత్ర్యం, తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు ప్రకటన జరిగింది.

పాలస్తీనా అరబ్బులు, అరబ్ లీగ్ (అరబ్ దేశాల కూటమి) రెండూ ఐక్యరాజ్యసమితి విభజన ప్రణాళికను అంగీకరించలేదు. ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని ఆమోదించిన తరువాత, స్థానిక పాలస్తీనా అరబ్ పోరాట విభాగాలు ఉద్భవించాయి. అరబ్ లిబరేషన్ ఆర్మీ ఏర్పడింది. బ్రిటీష్ మాండేట్ ముగిసే సమయానికి 1947 లో పాలస్తీనాలో దాదాపు మొత్తం సాగు భూమి పాలస్తీనియుల చేతిలోనే వుంది. 5.8 శాతం మాత్రమే యూదుల యాజమాన్యంలో వుంది. పాలస్తీనియులు ఐక్యరాజ్యసమితి తమను మోసం చేసిందని భావించారు. వాగ్దానం చేసిన పాలస్తీనా రాజ్యం ఎన్నడూ ఉనికిలోకి రాక పోగా, ఇజ్రాయెల్ ఆక్రమించని భూమిని – వెస్ట్ బ్యాంక్, సగం జెరూసలేంను ట్రాన్స్-జోర్డాన్, గాజాను ఈజిప్ట్ స్వాధీనం చేసుకున్నాయి. 1967 నాటి 6 రోజుల యుద్ధం వరకు ఇదే కొనసాగింది.

బ్రిటిష్ వారు తమ నిష్క్రమణను ప్రకటించిన క్షణంలోనే, ఐక్యరాజ్యసమితి తీర్మానానికి ముందే ఇజ్రాయెల్ తన లక్ష్యాన్ని సాధించడానికి సన్నాహాలు ప్రారంభించింది. ఇది చాలామంది పాలస్తీనియన్లను నిర్మూలించి, గరిష్ట భూమిని స్వాధీనం చేసుకోనే పన్నాగం. ఆ విధంగా ప్రారంభమైనదే పాలస్తీనియన్ 'నక్బా'.

## 2.5 1947-49 నాటి నక్బా :

అరబిక్ భాషలో 'నక్బా' అంటే 'విపత్తు' అని అర్థం. నక్బాను వికీపీడియా ఇలా వివరించింది 'నక్బా' అనేది పాలస్తీనా అరబ్బుల జాతి హననం, హింసాత్మక స్థానభ్రంశం. భూమి, ఆస్తి, వస్తువులను స్వాధీనం చేసుకోవడం ద్వారా, వారి సమాజాన్ని నాశనం చేయడం, వారి సంస్కృతి, గుర్తింపు, రాజకీయ హక్కులు, జాతీయ ఆకాంక్షలను అణచివేయడం. మొత్తంగా, ఇది పాలస్తీనా సమాజం విచ్ఛిన్నతను, పాలస్తీనా శరణార్థులు, వారి వారసులకు తిరిగివచ్చే హక్కును దీర్ఘకాలంగా తిరస్కరించడాన్ని తెలుపుతుంది. పాలస్తీనాను తిష్టవేసిన వారి (యూదు సెటిలర్స్) వలసరాజ్యంగా చేయడం కోసం జియోనిస్ట్ నాయకత్వం అన్నివిధాలుగా ప్రణాళిక వేసింది. 1946 చివరలో, తూర్పు పాలస్తీనాలోని కొన్ని భాగాలను గ్రేటర్ జోర్డాన్‌లో భాగంగా చేయడానికి జోర్డాన్ రాజు అబ్దుల్లాతో యూదు ఏజెన్సీ తీవ్రమైన చర్చలు ప్రారంభించింది. యూదు రాజ్యానికి వ్యతిరేకంగా ఏ అరబ్ సైనిక చర్యలోనూ పాల్గొనకూడదని అబ్దుల్లా వాగ్దానం చేశాడు. మొత్తం కథలో బెన్ గురియన్ అసలైన విలన్. 1947 డిసెంబరులో ఆయన ఇలా వ్రాశారు – "యూదుల ప్రాంతంలోని పాలస్తీనా సమాజం 'మా దయాదాక్షిణ్యాలపై' వుంటుంది. యూదులు కోరుకున్నది ఏదైనా వారికి చేయవచ్చు. 'ఆకలితో వారిని చంపడం' తో సహా". జియోనిస్ట్ నాయకత్వం హోలోకాస్ట్ పేరుతో సాయుధ ముఠాలను ప్రేరేపించింది. 'రెండవ

హోలోకాస్ట్' ఆసన్నమైందని ప్రకటించింది. హగానా, ఇర్గున్, పాల్మచ్ , స్టెర్న్ గాంగ్ జాతి హనన కార్యక్రమాలలో ఘోరమైన దురాగతాలను అమలు చేశాయి.

బెన్ గురియన్ ఇలా వారికి సూచనలు ఇచ్చాడు –"ప్రతి దాడి ఆక్రమణ, విధ్వంసం, బహిష్కరణతో ముగియాలి ..... అక్కడ కార్యకలాపాల సమయంలో దోషి, దోషి కాని వారి మధ్య తేడాను గుర్తించాల్సిన అవసరం లేదు... మనం వారిపై ఏ దయా లేకుండా, మహిళలు , పిల్లలతో సహా హాని చేయాల్సిన అవసరం వుంది".

ఐక్యరాజ్యసమితి విభజన ప్రణాళిక ప్రకటించిన వెంటనే, యూదుల సాయుధ సైన్యం, ముఠాలు వారికి కేటాయించిన భూములను భద్రపరచడానికి కదిలాయి. అది సాధారణ స్వాధీనం కాదు. స్థానిక పాలస్తీనియన్లను నాశనం చేసి తరిమికొట్టడం ద్వారా. 1948లో యూదు దళాలు పాలస్తీనియన్లను వేటాడేందుకు "విలేజ్ ఫైల్స్" (1930ల నుండి జియోనిస్టులు సృష్టించి, 1943,1947 లలో నవీకరించారు) ను ఉపయోగించారు. వారు ఒక గ్రామాన్ని ఆక్రమించిన వెంటనే శోధన, అరెస్టు కార్యకలాపాలు నిర్వహించారు. గ్రామంలోని పురుషులను వరుసలో నిలబెట్టి, ఇంతకుముందు తమకు సమాచారం ఇచ్చిన అదే వ్యక్తులకు తల నుండి పాదాల వరకూ వుండే వస్త్రాన్ని కప్పి, కళ్ల దగ్గర వున్న కన్నాలలో నుండి 'జాబితాలోని వ్యక్తులను' గుర్తించమనే వారు. ఈ విధంగా ఆ ద్రోహులు ఎవరో గ్రామస్తులకు తెలియకుండా జాగ్రత్త పడేవారు. గుర్తించిన పురుషులను అక్కడికక్కడే కాల్చి చంపుతారు. వారు ఇళ్లు, మసీదులు, ప్రభుత్వ భవనాలను ధ్వంసం చేశారు. ప్రజలను బలవంతంగా పారిపోయేలా చేశారు.

జాఫాలో ఇళ్ళను యాదృచ్ఛికంగా ఎంపిక చేసుకొని అందులో కుటుంబాలు వుండగానే డైనమైట్లతో పేల్చేసారు. పాలస్తీనియన్ల ఏకైక ఓడరేవు నగరమైన హైఫాను ఐక్యరాజ్యసమితి ఇజ్రాయెల్ కు ఇచ్చింది. 1948 ఏప్రిల్లో, యూదుల సైన్యం ఓడరేవు నగరం నుండి 75,000 మంది పాలస్తీనియన్లను "నిర్మూలించింది". 1948 మే నెలలో 'హగానా' ఏకర్ పట్టణానికి వెళ్లే నీటిలో టైఫాయిడ్ సూక్ష్మక్రిములను చొప్పించింది. 1948 మే 27న గాజాలో నీటి సరఫరాను విషపూరితం చేయడానికి కూడా ప్రయత్నించారు.

1948 నక్బా సమయం మార్చిలో (ఇజ్రాయెల్ భవిష్యత్ ప్రభుత్వంగా మారడానికి) ఏర్పాటు చేసిన "జ్యూయిష్ కన్సల్టెన్సీ" ప్రత్యక్ష ఆదేశాల మేరకు 531 గ్రామాలు, 11 పట్టణాలు, పట్టణ పరిసరాలు నాశనం చేయబడ్డాయి. వాటి నివాసులు తరిమివేయబడ్డారు.

అరబ్ సైన్యాలు (ఇరాక్, ఈజిప్ట్, లెబనాన్, సిరియా, ట్రాన్స్జోర్డాన్ నుండి) ఇజ్రాయెల్ లోకి ప్రవేశించి అనేక వైపులా దాడి చేశాయి. 1948 మే వరకు, యుద్ధానికి రెండు వైపులా పేలవమైన సన్నద్ధత వుండేది. కొత్తగా ఆవిర్భవించిన ఇజ్రాయెల్ సైన్యం, ఇజ్రాయెల్ కమ్యూనిస్ట్ పార్టీ సహాయంతో, చెకోస్లోవేకియా, సోవియట్ యూనియన్ నుండి భారీ ఆయుధ సంపత్తిని అందుకుంది. 1949 ప్రారంభంలో, ఇజ్రాయెల్ దళాలు తమ

ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాయి. వారు కొత్తగా జన్మించిన దేశాన్ని నిలబెట్టుకోవడమే కాదు, శాంతి చర్చలలోకి ప్రవేశించే ముందు అదనపు భూభాగాన్ని కూడా పొందారు. పోరాడిన ప్రతి అరబ్ దేశం ప్రత్యేక సంధి ఒప్పందాల ద్వారా క్రొత్త సరిహద్దు రేఖలను గుర్తించాయి. వాస్తవానికి ఈ సరిహద్దులు రాజకీయంగా ఎప్పటి నుండో ఇజ్రాయెల్ ఆధీనంలోనే వున్నాయి.

1948, 1949 యుద్ధాల సమయంలో స్వాధీనం చేసుకున్న భూభాగం అసలు %ఖచీ% కేటాయింపుతో పోలిస్తే ఇజ్రాయెల్ ప్రాంతాన్ని దాదాపు 40 శాతం విస్తరించింది. 1947 చివరిలో, 1949 నాటికి 6-7 లక్షల పాలస్తీనా అరబ్బులు యూదు రాజ్యానికి కేటాయించిన లేదా యూదు దళాలచే ఆక్రమించబడిన ప్రాంతాల నుండి తొలగించబడ్డారు. ఉన్నత వర్గాలు, ధనవంతులు ఇతర అరబ్ దేశాలకు వలస వెళ్లారు కానీ వందల వేల మంది సామాన్యులు యూదుల సైన్యం, మిలీషియాలచే తరిమివేయబడ్డారు.

పాలస్తీనియన్ల దుస్థితికి ప్రతిస్పందిస్తూ, UN-GA 11 డిసెంబర్ 1948 న 194 తీర్మానాన్ని ఆమోదించింది. ఇది శరణార్థులు తిరిగి రావడాన్ని నిర్దేశించింది. కానీ పది లక్షల మంది శరణార్థులు శిబిరాల్లోనే వుండిపోయారు. నేటికీ ఇజ్రాయెల్, అమెరికా ఈ ఐ.కా.స తీర్మానాన్ని అమలు చేయడాన్ని ఉల్లంఘిస్తూనే వున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత శరణార్థుల సమస్యను పరిష్కరించడానికి అప్పటికి ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ శరణార్థుల సంస్థ (ఐ. ఆర్. ఓ) వుండేది. కానీ యూదులు ఐఆర్ఓను పాలస్తీనా శరణార్థుల నుండి దూరంగా వుంచాలని కోరుకున్నారు. ఎందుకంటే ఐఆర్ఓ ఎల్లప్పుడూ శరణార్థులను స్వదేశానికి రప్పించడానికి పనిచేస్తుంది. ఈ విధంగా ప్రధానంగా పాలస్తీనా శరణార్థులతో వ్యవహరించడానికి యుఎన్-రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ (యుఎన్ ఆర్ డబ్ల్యు ఎ) ఉనికిలోకి వచ్చింది. ఈ ఏజన్సీకి శరణార్థులను వారి అసలు భూములు, గ్రామాలకు తిరిగి పంపించాలనే తప్పనిసరి నియమం లేదు. 1990 నాటికి, ఇజ్రాయెల్ ఆక్రమిత భూభాగాలు, అరబ్ దేశాలు, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో 40 లక్షలకు పైగా పాలస్తీనా శరణార్థులు చెల్లాచెదురుగా ఎక్కడెక్కడో నివసిస్తున్నారు. ఇజ్రాయెల్ 1967లో తన యుద్ధంతో మొత్తం పాలస్తీనాను ఆక్రమించాలనే తన లక్ష్యానికి దగ్గరగా వెళ్ళింది. ఆ తరువాత పాలస్తీనాలో ప్రతి యుద్ధం, దురాక్రమణతో ముందుకు సాగింది.

## 3. ఇజ్రాయెల్ యుద్ధాలు, విస్తరణ, దురాక్రమణ :

ఇజ్రాయెల్ తనను తాను హెూలోకాస్ట్ పరంగా, రక్తపిపాసి బాధితురాలిగా పరిగణిస్తూనే వుంది. అందువల్ల, ఇజ్రాయెల్ ఏమిచేసినా, అది చివరి ఆత్మరక్షణగా సమర్థిస్తుంది. ఈ విధంగా జియోనిస్టులు తమ ప్రజలను, సైన్యాన్ని జాత్యహంకార జాతీయ స్వరంతో ప్రేరేపిస్తారు. (కానీ గమనించండి. ఇజ్రాయెల్ హెూలోకాస్ట్ నిర్వహించిన ఆ నేర యూరోపియన్ దేశాలతో పోరాడదు కానీ బలహీనమైన, దుర్బలమైన వారిని లక్ష్యంగా

చేసుకుంటుంది. ఇది ప్రతీ ఫాసిస్ట్ రాజ్యం లక్షణం). అలాగే 1948 నుండి ఇజ్రాయెల్ సైన్యం, ప్రభుత్వం పాలస్తీనియన్లపై భారీ దాడులకు సాకులు వెతుకుతున్నాయి.

అరబ్ దేశాలపై ఇజ్రాయెల్ చేసిన అత్యంత ముఖ్యమైన యుద్ధం 1967లో జరిగిన మూడవ అరబ్ – ఇజ్రాయెల్ యుద్ధం. రెండవ యుద్ధం శరణార్థుల దాడులకు ప్రతీకారం తీర్చుకోవడం పేరిట ఈజిప్టుపై ఇజ్రాయెల్, ఫ్రాన్స్, బ్రిటన్ సంయుక్త త్రైపాక్షిక దురాక్రమణ.

నక్బా జ్ఞాపకాలను భరించిన శరణార్థ యువకులు 1959 అక్టోబరులో "పాలస్తీనా విముక్తి ఉద్యమం – "పాలస్తీనా లిబరేషన్ మూమెంట్" ను స్థాపించారు. దీనికి "ఫతాహ్" అని పేరు పెట్టారు. దాని అరబ్ పేరు "హరాకత్ అల్–తహ్రీర్ అల్–ఫిలాస్టినియ్యా" కు రివర్స్ ఎక్రోనిం. ఫతాహ్ చాలా రహస్యంగా స్థాపించబడింది. మొత్తం పాలస్తీనాను విముక్తి చేసి, "వలసవాద జియోనిస్ట్ ఆక్రమణ రాజ్యం, సమాజం" పునాదులను నాశనం చేయడమే ఫతాహ్ లక్ష్యం.

యాసిర్ అరాఫత్ నాయకుడిగా పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పిఎల్ఓ) స్థాపన మే 1964 లో ప్రకటించబడింది. పాలస్తీనా జాతీయ ఒడంబడిక పిఎల్ఓ వ్యవస్థాపక పత్రం – ఐక్యరాజ్యసమితి విభజన ప్రణాళిక, ఇజ్రాయెల్ స్థాపన చట్టవిరుద్ధమైన చర్యలు అని ఒడంబడిక నొక్కిచెప్పింది. పాలస్తీనా మొత్తాన్ని అరబ్ మాతృభూమిగా విముక్తి చేయాలని పిలుపునిచ్చింది.

పిఎల్ఓ ఇజ్రాయెల్ లో వ్యక్తిగత దాడులను నిర్వహించింది. దాని సభ్యులు సిరియా, లెబనాన్, ఈజిప్ట్, జోర్డాన్ నుండి ప్రవేశించారు. పాలస్తీనా పట్ల, పిఎల్ఓ పట్ల ప్రజల సానుభూతి ఈ దేశాలన్నింటిలో విపరీతంగా పెరిగింది. ఇది ఈ నాలుగు అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌ను ఖండించటానికి, దాడికి ప్రణాళిక వేయడానికి బలవంతం చేసింది. ఇజ్రాయెల్ 1967లో ఈ అరబ్ దేశాలపై ముందస్తు యుద్ధంగా భారీ వైమానిక, భూ దాడిచేసింది. జూన్ 5న యుద్ధం ప్రారంభమై, జూన్ 11న కాల్పుల విరమణతో ముగిసింది. జూన్ 5న జరిగిన వైమానిక దాడులు ఈజిప్టు వైమానిక దళం నేలమీద వున్నప్పుడు చాలావరకు నాశనం చేశాయి. సిరియన్ వైమానిక దళంలో మూడింట రెండు వంతులను కూడా ధ్వంసం చేశాయి. జోర్డాన్ దళాలు వెస్ట్ బ్యాంక్, జెరూసలేంను విడిచిపెట్టి వెనక్కి తగ్గాయి.

ఇజ్రాయెల్ ఆక్రమించిన (ఈజిప్ట్) సినాయ్, గాజాలో కొంతభాగం, వెస్ట్ బ్యాంక్, గోలన్ హైట్స్, జెరూసలేం–ఇవన్నీ 1967 యుద్ధం నుండి ఇజ్రాయెల్‌కు లభించిన లాభాలు. ప్రతి దేశంతో సంధి ఒప్పందాలు కుదుర్చుకున్న తరువాత కూడా ఈ ఆక్రమణలలో సినాయ్ మినహా దేనినీ విడిచిపెట్టలేదు.

1967 యుద్ధం ఫలితంగా ఐక్యరాజ్యసమితి విభజన ప్రణాళికతో పోలిస్తే ఇజ్రాయెల్ నియంత్రణలో 40 శాతం ఎక్కువ భూమి వుంది. తదుపరి అన్ని "శాంతి

ఒప్పందాలు" ఈ దురాక్రమణ విలీనాలను ఎలా ఆమోదించాలో, వాటిని అంగీకరించమని పాలస్తీనా ప్రతినిధులను ఎలా బలవంతం చేయాలనే దానిపైనే కేంద్రీకరించాయి. వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌ను ఇజ్రాయెల్‌లో కలిపేసుకోవడం 1948 నుండి ఇజ్రాయెల్ ప్రణాళికలో వుంది. 1967 లో అమలు చేయబడింది.

మళ్ళీ 1982 లో సాయుధ దురాక్రమణతో "ఆత్మరక్షణ" అనే ప్రసిద్ధ సాకుతో, ఇజ్రాయెల్ లెబనాన్ లోని పిఎల్ఓ మౌలిక సదుపాయాలపై భారీ వైమానిక దాడులు నిర్వహించింది. తరువాత లెబనాన్‌పై భారీ దండయాత్ర జరిగింది. 40,000 మంది పాలస్తీనియన్లు, లెబనీస్ పౌరులు చంపబడ్డారు. పదివేల మంది గాయపడ్డారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇదంతా పిఎల్ఓను పూర్తిగా నిర్వీర్యం చేయడానికీ, పాలస్తీనా నాయకత్వాన్ని శాశ్వతంగా నిర్మూలించడానికి జరిగింది.

1982 తరువాత, లౌకిక పిఎల్ఓను అణగదొక్కడానికి ఇజ్రాయెల్ హమాస్‌కు మద్దతు ఇస్తూ వచ్చింది.

ఐక్యరాజ్యసమితి కేటాయింపులు, అప్పటి నుండి ఇజ్రాయెల్ అక్రమ ఆక్రమణలను చూపించే మ్యాప్ ఈ వ్యాసం చివరిలో అనుబంధంగా ఇవ్వబడింది. జూలై 2023లో పాలస్తీనా దేశం అంతర్జాతీయ న్యాయస్థానానికి సమర్పించిన లిఖితపూర్వక ప్రకటన నుండి ఈ పటం పునరుత్పత్తి చేయబడింది.

**3.1 శాంతి ఒప్పందం నాటకాలు :**

పాలస్తీనాలో శాంతి కోసం అమెరికా మధ్యవర్తిత్వం వహించిన శాంతి ఒప్పందాలు, శిఖరాగ్ర సమావేశాలు ఎల్లప్పుడూ ప్రహసనంగా వుండేవి. కానీ వాటి ఉద్దేశం పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ విస్తరణను రక్షించడమే. 1991నాటి మాడ్రిడ్ సమావేశం, 1993 నాటి ఓస్లో ఒప్పందాలు, 2000 నాటి క్యాంప్ డేవిడ్ శిఖరాగ్ర సమావేశం ఎల్లప్పుడూ ఇజ్రాయెల్ పరిస్థితులను అంగీకరించమని పిఎల్ఓపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా వుండేవి. పాలస్తీనా గుర్తింపును తిరస్కరించడం, పాలస్తీనా అరబ్ రాజ్యాన్ని తిరస్కరించడం, పాలస్తీనా ప్రజల ప్రతినిధిగా PLO ప్రధాన పాత్రను గుర్తించ నిరాకరించడం – ఇవన్నీ శాంతి కోసం వాస్తవిక అవకాశాలను నిరాకరించడమే.

1948 నక్బా సంవత్సరం, శరణార్థులు తమ భూములకు తిరిగి రావడం అనే రెండు అంశాలు శాంతి అజెండా నుండి మినహాయించబడ్డాయి. శాంతి ప్రక్రియలు ఎల్లప్పుడూ 1967 యుద్ధంలో ఇజ్రాయెల్ ఆక్రమించిన ప్రాంతాలపైనే వుండేవి. క్లింటన్ (USA), హొస్నీ ముబారక్ (ఈజిప్ట్) ఓస్లో ఒప్పందాలతో అరాఫత్‌ను మోసం చేశారు. 1993 లో ఓస్లో, 2000 లో క్యాంప్ డేవిడ్ పాలస్తీనాకు సార్వభౌమాధికారం, ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా జెరూసలేం, శరణార్థుల సమస్యకు పరిష్కారం లేకుండా వదిలివేశారు.

ఓస్లో ఒప్పందాలలో గాజా స్ట్రిప్ ఇజ్రాయెల్ 'ఎన్క్లేవ్' గా మారిందని లిఖించబడ్డాయి. గాజాలో నీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు నేటికీ ఇజ్రాయెల్ చేతిలోనే వున్నాయి. గాజా, వెస్ట్ బ్యాంక్ అవిభక్త ఐక్య ప్రాంతాలనీ, వాటి సమగ్రతను విచ్ఛిన్నం చేయలేమని కూడా ఓస్లో ఒప్పందాలు తేల్చిచెప్పాయి. అప్పటినుండి యుఎస్, ఇజ్రాయెల్ వారే రూపొందించి, అంగీకరించిన ఒప్పందాలను ఉల్లంఘించి గాజా, వెస్ట్ బ్యాంక్‌ను వేరు చేయడానికి అంకితమయ్యారు.

అమెరికా, ఇజ్రాయెల్ ఎల్లప్పుడూ అరాఫత్‌ను పాలస్తీనియన్ల జాతీయ విముక్తి ఉద్యమ నాయకుడిగా కాకుండా 'ఉగ్రవాది' గా ముద్రవేశాయి. సైనికంగా శక్తివంతమైన శత్రువుకు (ఏ ఒప్పందాలను పట్టించుకోని ఇజ్రాయెల్) ఎదురు నిలబడడం, ప్రపంచంలోనే అతిపెద్ద దుండగుడు –అమెరికాకు ఎదురు నిలబడడం, నిజాయితీ లేని అరబ్ దేశాల మద్దతుపై ఆధారపడడంతో – అరాఫత్ తన సొంత దేశంలో, పాలస్తీనాలో పట్టు నిలుపుకోవడానికి వారి ఒప్పందాలకు అంగీకరించక తప్పలేదు. దాంతో ఇజ్రాయెల్ సైన్యం యాసిర్ అరాఫత్‌ను 2002 నుండి 2004 నవంబరులో మరణించే వరకు రెండు సంవత్సరాలకు పైగా రామల్లా కాంపౌండ్‌కు పరిమితం చేసి నిర్బంధించింది.

ఇజ్రాయెల్ శాంతి ఈ షరతులతో కూడుకున్నది. పాలస్తీనా శరణార్థులు తిరిగి వారి భూములకు రావడానికి, ఇజ్రాయెల్‌లో పాలస్తీనియన్లకు సమాన హక్కులు ఆశించడం జెరూసలేం హెూదాను పునరుద్ధరించాలని ఆశించడం, వారి స్వదేశంలో మానవులుగా సాధారణ జీవితం ఆశించడం మరచిపోవాలి. ఈ షరతులను పాలస్తీనా ప్రతినిధి ఎవరైనా అంగీకరిస్తే, ఇజ్రాయెల్ 'ఉదారంగా' శాంతిని మంజూరు చేస్తుంది. అమెరికా దీనికి హామీ ఇస్తుంది.

ఇజ్రాయెల్, అమెరికా చిత్తశుద్ధిని ఈ చారిత్రక వాస్తవం నుండి అంచనా వేయవచ్చు: ఇజ్రాయెల్‌తో పాటు పాలస్తీనా రాజ్యం అనే 1976 నాటి యుఎన్ తీర్మానాన్ని (ఈ తీర్మానం, ప్రాథమింగా 1967 నాటి యుఎన్ తీర్మానం 242 నకలు) అమెరికా తన వీటోతో రద్దుచేసింది. అప్పటినుండి ఇప్పటివరకు దౌత్య పరిష్కారం – "రెండు – దేశాల పరిష్కారం" అవకాశాన్ని అమెరికా అడ్డుకుంది. క్లింటన్ ఒక అడుగు ముందుకువేసి ఐక్యరాజ్యసమితి తీర్మానాలను "వాడుకలో లేనివి, కాలక్రమానుసారం లేనివి" అని వర్ణించారు. (అమెరికా అధ్యక్షులు, వారి రాయబారులు, అమెరికా దౌత్యపరంగా తీవ్రంగా ఒంటరిగా వున్నప్పుడల్లా, 'రెండు–దేశాల పరిష్కారం' గురించి అబద్ధాలు వాగుతూనే వుంటారు).

పాలస్తీనియన్లు , ఇతర అరబ్ దేశాలపై ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న భయంకరమైన చర్యలను విస్మరిస్తూ, అమెరికా ఇజ్రాయెల్‌కు ఈ అర్థరహిత, తర్కరహితంగా ఎందుకు మద్దతు ఇస్తుందనే ప్రశ్నను పరిశీలిద్దాం.

## 4. అమెరికా విధానం, ఇజ్రాయెల్ కు మద్దతు:

ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యానికి సంబంధించి అమెరికా విధానాలు, చర్యలు అనేక అంశాల ద్వారా నిర్ణయించబడతాయి.

**కొన్ని ప్రధాన అంశాలు:** సైనిక, ఆయుధ పరిశ్రమల పరంగా USA ఆర్థిక ప్రయోజనాలు; USA లో ఇజ్రాయెల్ లాబీ, చర్యల ప్రభావం; క్రిస్టియన్ ఫండమెంటలిస్ట్ ప్రభావాలు; మధ్యప్రాచ్యంలో USA చమురు ప్రయోజనాలు; USA పై 9/11 ఉగ్రవాద దాడుల తరువాత ఉద్దేశపూర్వకంగా సృష్టించబడిన సాధారణ ఇస్లామోఫోబియా.

1949 నుండి 2005 వరకు అమెరికా ఇజ్రాయెల్ కు 100 బిలియన్ డాలర్లకు పైగా గ్రాంట్లను (భారతీయ రూ. ఈ కాలంలో డాలర్ల సగటు మారకం రేటుతో పోల్చితే 1 లక్ష కోట్లు) ఇచ్చింది. 10 బిలియన్ డాలర్లు (10,000 కోట్లు) అప్పుగా ఇచ్చింది. ఆ తర్వాత బుష్ ఇజ్రాయెల్‌కు చేసిన సైనిక సహాయం 21 బిలియన్ డాలర్లు (రూ. 95,000 కోట్లు 2006 మార్పిడి రేటుతో). ఒబామా బేషరతు సైనిక సహాయం 30 బిలియన్ డాలర్లు (రూ. 2010 మార్పిడి రేటుతో 1,35,000 కోట్లు).

అమెరికా అధ్యక్ష అభ్యర్థులకు పెట్టుబడులుగా పెద్ద మొత్తంలో విరాళాలు ఇచ్చే అమెరికా ఆయుధ తయారీదారులకు ఇది భారీ బోనంజా. బైడెన్ ఇంకా అధ్వాన్నంగా వున్నాడు. అతను 2023లో మాత్రమే ఇజ్రాయెల్‌కు 17 బిలియన్ డాలర్ల సైనిక సహాయం ఇచ్చాడు (Rs.1,40,000 కోట్లకు సమానం). ఆ సంవత్సరంలో ఇజ్రాయెల్ గాజాలో మారణహోమం ప్రారంభించింది. కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్ ఆఫ్ అమెరికా ప్రకారం, అమెరికా సహాయాన్ని అత్యధికంగా అందుకున్న దేశం ఇజ్రాయెల్. 1946 నుండి 2024 మధ్య మొత్తం సహాయం 300 బిలియన్ డాలర్లకు సమానం. అందులో 220 బిలియన్ డాలర్లు సైనిక సహాయం. 1 $ కనీసం Rs.50 అనుకున్నా సైనిక సహాయం మొత్తం 11,00,000 కోట్ల రూపాయలు (ఇజ్రాయెల్ ఈ డబ్బును సైనిక విమానాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ట్యాంకులు మొదలైనవి కొనుగోలు చేయడానికి ఉపయోగించింది, ప్రధానంగా యుఎస్ నుండి, పాక్షికంగా యూరప్ నుండి). అంటే 11 లక్షల కోట్ల రూపాయల విలువైన ఇజ్రాయెల్ నేరాలకు అమెరికాదే బాధ్యత. ఇదీ ప్రపంచంలోని గొప్ప "ప్రజాస్వామ్య విజేత" గొప్ప రికార్డు! ఇతర దేశాలలో పెద్దసంఖ్యలో సైనిక స్థావరాలను నిర్వహిస్తున్న ఏకైక దేశం అమెరికా. ఇది మధ్యప్రాచ్యంలో దాదాపు 45,000 సైనిక బలంతో పెద్ద సైనిక స్థావరాలను కలిగి వుంది. ఏ ప్రయోజనం కోసం వారు ఈ స్థావరాలను నిర్వహిస్తారు? పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ నేర సైనిక దళాలను, వారి జాత్యహంకార చర్యలను పర్యవేక్షించడం, మార్గనిర్దేశం చేయడం, బ్యాకప్ చేయడం, సహాయం చేయడం; అరబ్ దేశాలను లొంగదీసుకోవడానికి బెదిరించడం; ఈ ప్రాంతం నుండి చమురు సరఫరాను కాపాడటం కోసం. అమెరికా ఈ భారీ సైనికవ్యయం యుఎస్

కార్పొరేట్ల సైనిక పారిశ్రామిక సముదాయాలను నిర్వహించడానికి , కొనసాగించడానికి. ప్రపంచంలోని ఏదో ఒక ప్రాంతంలో యుద్ధం లేదా పోరాటం జరగకపోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందనేది అందరికీ తెలిసిన వాస్తవం.

**రెండవ అంశం:** అమెరికాలో ఇజ్రాయెల్ లాబీ. అమెరికాలోని జియోనిస్ట్ ప్రవాసులు అత్యంత ధనవంతులైన యూదులు. మధ్యప్రాచ్యంలో అమెరికా విధానాన్ని ప్రభావితం చేయడానికి వారు అమెరికా అధ్యక్ష అభ్యర్థులకు నిధులు సమకూరుస్తారు. అమెరికన్ ఇజ్రాయెల్ పబ్లిక్ అఫైర్స్ కమిటీ (AIPAC) అనేది వాషింగ్టన్‌లో ఇజ్రాయెల్ లాబీ. "నియర్ ఈస్ట్ పాలసీ" అనే పత్రిక ఇజ్రాయెల్ అనుకూల లాబీ గొంతుకగా మారింది. అమెరికా ఆర్థిక, సాంస్కృతిక, విద్యా రంగాలలో యూదుల ప్రబల శక్తిగా ఉన్నత స్థానాలను ఆక్రమించారు.

అమెరికాలోని రాజకీయ నాయకులందరూ ఏఐపీఏసీకి భయపడతారు. ఇజ్రాయెల్ అనుకూల విధానాలను విమర్శించే చాలామంది రాజకీయ జీవితాలను అంతం చేయడంలో ఇది విజయవంతమైంది. (విలియం ఫుల్ బ్రైట్, పాల్ ఫైండ్లీ మొదలైనవి).

ఇజ్రాయెల్ లాబీ ప్రభావంతో USA మధ్యప్రాచ్యం విధానాలు ఎల్లప్పుడూ ఇజ్రాయెల్‌ను, దాని ప్రయోజనాలను రక్షించడానికి వుండేవి. అమెరికా జాతీయ ప్రయోజనాలను కాపాడటానికి నిక్సన్ తన సిద్ధాంతాన్ని వివరించినప్పుడు, మధ్యప్రాచ్యంలో అమెరికా విధానానికి ప్రధాన స్తంభంగా ఇజ్రాయెల్‌పై పూర్తిగా ఆధారపడటం వుంది. ఇజ్రాయెల్ అనుకూల లాబీ ఒత్తిడితో క్లింటన్, తూర్పు జెరూసలేంను "అభివృద్ధి" చేయడానికి ఇజ్రాయెల్‌కు స్వేచ్ఛ ఇచ్చారు. ఇజ్రాయెల్, 2 లక్షల మంది పాలస్తీనియన్లను అక్కడ నుండి తరిమికొట్టి అక్కడ 2 లక్షల మంది యూదులను స్థిరపరిచింది.

**మూడవ అంశం:** యూదులకు, ఇజ్రాయెల్ కు క్రైస్తవ ఛాందస వాదుల మద్దతు. క్రైస్తవ ఛాందస వాదులు, ఇజ్రాయెల్ రాజ్యం మధ్య బలమైన పొత్తు వుంది. క్రైస్తవ ఛాందస వాదులకు ఇజ్రాయెల్ రాజ్య సృష్టి, యూదులు తిరిగి రావడం, వారు క్రైస్తవ మతంలోకి మారడం, మెస్సీయ రెండవ రాకడ వంటి దైవిక పథకాలు కార్యరూపం దాల్చబోతున్నాయనేదానికి నిర్ణయాత్మక రుజువు. ఈ ఛాందసవాదులు ఇజ్రాయెల్‌కు పూర్తి మద్దతు కోసం బోధిస్తారు. అందువల్ల వారిని అధికారికంగా "క్రిస్టియన్ జియోనిస్టులు" అని పిలుస్తారు. సగటు క్రిస్టియన్ జియోనిస్ట్ "ఇజ్రాయెల్ కోరుకున్నది దేవుడు కోరుకుంటాడు", "ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా నిలబడేవాడు దేవునికి వ్యతిరేకంగా నిలబడతాడు" అని నమ్ముతాడు, బోధిస్తాడు. USA (ఇది శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ) లో మూఢనమ్మకాలు, మతపరమైన పిడివాదం మన దేశం కంటే చాలా ఎక్కువ. అందువల్ల, మధ్యప్రాచ్యంలో US విధానాలు ఈ రకమైన క్రైస్తవ ఛాందస వాదుల విశ్వాసం ద్వారా రూపొందించబడ్డాయి.

**నాలుగో అంశం:** మిడిల్ ఈస్ట్ ఆయిల్‌లో ఆదాయాలు, పెట్టుబడులను పరిరక్షించడం. ఇరవయ్యవ శతాబ్దం మొదటి అర్ధభాగంలో సౌదీ అరేబియాలో చమురు కోసం అన్వేషించడానికి నాలుగు అమెరికా కంపెనీలు –కాలిఫోర్నియా స్టాండర్డ్ ఆయిల్, న్యూజెర్సీ స్టాండర్డ్ ఆయిల్, న్యూయార్క్ స్టాండర్డ్ ఆయిల్ , టెక్సాకో – మొదటి రాయితీలు (లేదా ఒప్పందాలు) గెలుచుకున్నాయి. 1938 లో వారు అక్కడ, బహ్రెయిన్‌లో చమురును కనుగొన్నారు. ఐదవ కంపెనీ అయిన గల్ఫ్ ఆయిల్ కొన్నినెలల తరువాత కువైట్‌లో చమురును కనుగొంది.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఒప్పందాల ప్రకారం, ఇరాన్ చమురు ఆస్తులు బ్రిటిష్ వారికి ఇవ్వబడ్డాయి. కానీ 1979 లో ఇస్లామిక్ విప్లవం, ఇరాన్ చివరి షాను పడగొట్టడంతో పాశ్చాత్య శక్తుల చమురు ప్రయోజనాలకు, ముఖ్యంగా బ్రిటన్ 'ప్రయోజనాలకు' ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పుడు బ్రిటిష్ చమురులో ఆదాయాలు, పెట్టుబడులు పూర్తిగా యుఎఇ (దుబాయ్, అబుదాబి) లో వున్నాయి. అమెరికా విధానం మధ్యప్రాచ్య చమురు ప్రవాహాన్ని అన్నివిధాలుగా తమ గుప్పిట్లో పెట్టుకోవాలనేది. అందువల్ల, దాని విధానాలు చమురు ప్రయోజనాలు – ఇజ్రాయెల్ అనుకూల లాబీ మధ్య సంఘర్షణ, సమతుల్యతగా వుండేవి. అమెరికా భద్రతా మండలి సలహాదారుడు ఈ విధంగా పేర్కొన్నాడు – "రాడికల్ అరబ్ జాతీయవాదులతో పోరాడటానికి, అవసరమైతే బలవంతంగా పర్షియన్ గల్ఫ్ చమురును హస్తగతం చేసుకోవాలనుకొంటే, నియర్ ఈస్ట్‌లో మిగిలి వున్న ఏకైక బలమైన పాశ్చాత్య అనుకూల శక్తిగా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వడం తార్కిక పరిణామం అవుతుంది".

**ఐదవ అంశం:** "ఇస్లామోఫోబియా". ముస్లింలపై విద్వేషం సృష్టించబడింది. దీనికి ఆజ్యం పోసింది 9/11 – అమెరికా ట్విన్ టవర్లపై ఉగ్రవాదుల దాడి. ఉగ్రవాదులపై దృష్టి కేంద్రీకరించే బదులు, అమెరికా రాజకీయ నాయకత్వం తన "ఉగ్రవాదంపై యుద్ధం" ను ఆచరణాత్మకంగా "ముస్లింలపై యుద్ధం" గా నిర్దేశించింది. ముస్లింలందరూ హింసాత్మక అనాగరికులు, ఉగ్రవాద దూతలు అనే ప్రచారాన్ని వారు సృష్టించి, నిర్వహించారు. (ఇలా ప్రపంచంలోని అనేక ఫాసిస్టు శక్తులు ముస్లింలను లక్ష్యంగా చేసుకుని, వారిపై క్రూరమైన దురాగతాలతో సహా వారిని అణచివేయడానికి సహాయపడింది).

2001 తరువాత, అమెరికా నాయకత్వం ఇజ్రాయెల్‌కు గణనీయమైన సహాయం, పటిష్టీకరణను "ఉగ్రవాదంపై యుద్ధం"లో అత్యంత ముఖ్యమైన భాగంగా పరిగణించింది. దురదృష్టవశాత్తు, పాలస్తీనాలోని బలహీన పౌరులు దీని భారాన్ని ఎదుర్కొంటున్నారు.

అమెరికా పాత్రికేయుడు బాబ్ వుడ్వార్డ్ తన ఇటీవలి పుస్తకం "వార్" లో అమెరికా అధ్యక్షుడు బైడెన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడుతూ –"ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్ గురించి పెరుగుతున్న అవగాహన ఏమిటంటే – మీది ఒక రోగ్ రాజ్యం,

కఠినమైన దేశం" అని చెప్పినట్లు ఉటంకించారు. ఇజ్రాయెల్‌కు అమెరికా విధానాలు, సైనిక సహాయాలను చూసిన తరువాత, "అతిపెద్ద రోగ్ రాజ్యం, అతిపెద్ద కఠినమైన దేశం" మధ్యప్రాచ్యంలో తన "బీట్ కానిస్టేబుల్ ను" తన "కఠినచర్యల" పై మందలించడం లాగా కనిపిస్తుంది!

## 5. గాజా అనబడే విషాదం :

అక్టోబర్ 27, 2023 నుండి ఒక సంవత్సరానికి పైగా గాజాలో ఇజ్రాయెల్ నిర్వహిస్తున్న మారణహోమాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు "విషాదం" అనేది తక్కువ మాటే. ఏడాది కంటే ఎక్కువకాలం జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్, పాలస్తీనియన్లకు గాజాను "నరకం" గా మార్చింది.

ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు ప్రధాన భూ, సముద్ర ద్వారాలుగా 'గాజా' పాలస్తీనాకు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది. గాజా లేకుండా, పాలస్తీనా దేశానికి లేదా వెస్ట్‌బ్యాంక్ కు "స్వయంప్రతిపత్తి" అర్థం లేనిది. 1948, 1967 మధ్య గాజా, పాలస్తీనియన్ల పెద్ద శరణార్థి శిబిరంగా మారింది. ఇజ్రాయెల్, ఈజిప్టు విధానాల ద్వారా ఇది తీవ్రంగా పరిమితం చేయబడింది. 1967 యుద్ధంలో ఇజ్రాయెల్, గాజా స్ట్రిప్‌ను ఆక్రమించిన తర్వాత 1948లో ఐక్యరాజ్యసమితి గాజాలో నోటిఫై చేసిన దానిలో సగం కంటే తక్కువకు తగ్గించింది. ఒకప్పుడు పచ్చిక బైళ్లతో వున్న దక్షిణ పాలస్తీనాలోని ఈ తీరప్రాంతం 1967 నాటికి ప్రపంచంలోనే అత్యంత జనసాంద్రత కలిగిన నివాస ప్రాంతంగా మారింది.

ప్రస్తుతం గాజా సుమారు 41 కిలోమీటర్ల పొడవు, 6 నుండి 12 కిలోమీటర్ల వెడల్పుతో మన మెట్రో నగరాల్లో మూడింట ఒక వంతు కంటే తక్కువ వుంటుంది. ఇది ఇప్పుడు 21 లక్షల జనాభాను కలిగి వుంది. వెస్ట్ బ్యాంక్ మాదిరిగా గాజాలో ఇజ్రాయెల్ ఆశపడే భూభాగం లేదు. గాజా పాలస్తీనియన్లను తరిమివేయడానికి జోర్డాన్ వంటి లోతట్టు ప్రాంతమూ లేదు. ఇదే పాలస్తీనియన్లకు వరమూ, శాపంగా పరిణమించింది.

ఇజ్రాయెల్ ప్రధానమంత్రులు ఏరియల్ షరోన్, ఎహుద్ బరాక్, షిమోన్ పెరెస్, టిజ్పి లివ్ని, నెతన్యాహు అందరూ – గాజా స్ట్రిప్‌ను బయటి నుండి నియంత్రించే విధానాన్ని, వెస్ట్ బ్యాంక్‌ను బంటుగా నిర్వహించే విధానాన్ని కొనసాగించారు.

1994 లో ఇజ్రాయెల్, గాజా స్ట్రిప్‌కు విద్యుత్ కంచె వేసేసింది. 2000 లో గాజా ప్రాదేశిక జలాల్లో చాలా ఆశాజనకమైన గ్యాస్ క్షేత్రాలను బిజి గ్రూప్ కనుగొంది. ఈ ఆవిష్కరణ తర్వాత మత్స్యకారుల పడవలపై దాడులు ప్రారంభమయ్యాయి. నిరంతర దాడులు,

బెదిరింపులు, హింస ద్వారా మత్స్యకార పడవలను క్రమంగా సముద్రానికి దూరం చేసారు. గాజాకు చెందిన మధ్యదరా సముద్రంలో వున్న మెరైన్ ఫీల్డ్ నుండి 1.5 బిలియన్

క్యూబిక్ మీటర్ల సహజ వాయువు కోసం ఇజ్రాయెల్ ఎలక్ట్రిక్ కార్పొరేషన్ చర్చలు జరిపింది. ఇది పాలస్తీనా వనరులను పట్టపగలు దోచుకోవడమే.

2006 నుండి గాజా, ఇజ్రాయెల్ యొక్క నాలుగు పూర్తి స్థాయి సైనిక దాడులను చూసింది.

2004 లో ఇజ్రాయెల్ సైన్యం నెగెవ్ ఎడారిలో 45 మిలియన్ యుఎస్ డాలర్ల (రూ. ఆ సంవత్సరం మార్పిడి రేటుతో 200 కోట్లు) ఖర్చుతో ఒక "డమ్మీ సిటీ" నిర్మించింది. ఇందులో అన్ని వీధులు, మసీదులు, ప్రభుత్వ భవనాలు, కార్లు, పార్కింగ్ మొదలైన వాటి ప్రతిరూపాలు వుండేవి. హమాస్‌కు వ్యతిరేకంగా "మెరుగైన యుద్ధం" చేయడానికి ఇజ్రాయెల్ సైన్యానికి 2006 లో అక్కడ శిక్షణ ఇచ్చింది.

2004 నుండి 2009 వరకు గాజాలో హింస చెలరేగింది. 2005 లో అంతర్జాతీయ ఒత్తిడి కారణంగా ఇజ్రాయెల్ తన సైనిక దళాలను గాజా నుండి ఉపసంహరించుకుంది. కానీ వాస్తవానికి భవిష్యత్తులో దాని సైన్యానికి కనీస నష్టాలతో గాజాపై మరింత సమర్థవంతంగా దాడి చేయడానికే. 2009 లో గాజా ప్రజల ఊచకోత జరిగింది. ఇజ్రాయెల్ 2005 లో గాజాపై "ఆపరేషన్ ఫస్ట్ రైన్స్" నిర్వహించింది. నవంబర్ 2005లో 'కాల్పుల విరమణ' ఒప్పందం కుదిరింది. ఇది కొన్ని వారాలపాటు కొనసాగింది.

2006 జనవరిలో, మొదటి పూర్తి స్వేచ్ఛాయుత ఎన్నికలు (అరబ్ ప్రపంచంలో) పాలస్తీనాలో జరిగాయి. హమాస్ పార్లమెంటుకి అత్యధిక సీట్లు గెలుచుకుంది. అమెరికా, ఇజ్రాయెల్ అలా కోరుకోలేదు. గొప్ప "ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించే" అమెరికా, ఇజ్రాయెల్, పాలస్తీనియన్లను 'తప్పుడు మార్గంలో' ఓటు వేసినందుకు శిక్షించాలని వెంటనే నిర్ణయించాయి. కఠినమైన ముట్టడి, హింస, ఇతర శిక్షలు మొదలయ్యాయి. 2007 లో హమాస్ న్యాయమైన ఎన్నికలలో విజయం సాధించడం కంటే పెద్ద నేరానికి పాల్పడింది. అమెరికా పన్నిన సైనిక తిరుగుబాటును ముందుగా పసిగట్టి, గాజాను దాని స్వంత దళాలతో స్వాధీనం చేసుకుంది. పశ్చిమ దేశాలలో దీనిని 'హమాస్ బలవంతంగా గాజాను స్వాధీనం చేసుకోవడం' అని వర్ణించారు!

ఇజ్రాయెల్ 2006లో "సమ్మర్ రైన్స్", "ఆటం క్లౌడ్స్" అనే సైనిక కార్యకలాపాలను నిర్వహించింది – భారీ ఫిరంగి , వైమానిక దాడులతో గాజాపై బాంబు దాడికి ఇవి సిగ్గుమాలిన పేర్లు. 2006 లో ఇజ్రాయెల్ సైనికుడిని బందీగా పట్టుకుంది హమాస్. ఈ 'అవమానాన్ని' జీర్ణించుకోలేక రెచ్చగొట్టే మీడియా, యుద్ధోన్మాద ప్రజల సహాయంతో– గాజాపై సైనికంగా క్రూరంగా విరుచుకుపడింది. పాలస్తీనా పౌరులపై నిషేధిత ఆయుధాలను ఉపయోగించింది, పాఠశాలలు, ఆసుపత్రులు, శరణార్థ శిభిరాలు వంటి పౌర లక్ష్యాలపై విచక్షణారహితంగా, నిర్లక్ష్యంగా బాంబు దాడులు చేసింది.

2000 నుండి, ఇజ్రాయెల్ దళాలు పెద్ద సంఖ్యలో పిల్లలతో సహా దాదాపు 4000

మంది పాలస్తీనియన్లను చంపాయి. 20,000 మందికి పైగా గాయపడ్డారు. (ప్రస్తుత మారణకాండతో పోలిస్తే ఇవి పెద్ద సంఖ్యలే కావు).

2008 నవంబరు 24న హమాస్ ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడిలో ముగ్గురు ఇజ్రాయెలీలు మరణించారు. దీనిని సాకుగా చెప్పి 15లక్షల గాజా పాలస్తీనియన్లపై 2008 నవంబర్ 25 నుండి 2009 జనవరి 25 వరకు వాయు, భూమి, సముద్ర మార్గాల నుండి బాంబు దాడులు చేసింది ఇజ్రాయెల్. తనను తాను రక్షించుకోవడానికి బలగాలను ఉపయోగించుకునే హక్కు తనకు మాత్రమే వుందని, ఇదే హక్కు తనకు వ్యతిరేకంగా ఎవరికీ లేనట్లుగా ఇజ్రాయెల్ ప్రతీక్షణం ప్రవర్తిస్తుంది. (వాస్తవానికి, అమెరిక ప్రాంతీయ 'గూండా' గా, ప్రపంచవ్యాప్తంగా తన యజమాని చేసే గూండాగిరిని ఇక్కడ తాను చేయడం గురుపరంపరగా భావిస్తుంది).

2014 ఏప్రిల్లో, పాలస్తీనియన్లు మరో 'నేరానికి' పాల్పడ్డారు. గాజా ఆధారిత హమాస్, వెస్ట్-బ్యాంక్ ఆధారిత పాలస్తీనా అథారిటీ ఐక్యత ఒప్పందంపై సంతకం చేయడం. ఇజ్రాయెల్ ఆగ్రహానికి గురై, వెస్ట్ బ్యాంకులోని హమాస్‌ను లక్ష్యంగా చేసుకుని పెద్ద దాడిని ప్రారంభించింది. హమాస్ ప్రతిస్పందిస్తే- మళ్ళీ 'ఆత్మరక్షణ' పేరిట గాజాను క్రూరంగా నాశనం చేసింది.

ఇజ్రాయెల్ తనను తాను రక్షించుకోవాలనుకుంటే సూటి మార్గం వుండనే వుంది. ఆక్రమిత భూభాగాలలో దాని నేర కార్యకలాపాలను ఆపివేయడం, 'రెండు దేశాల' పరిష్కారంపై దీర్ఘకాల అంతర్జాతీయ ఏకాభిప్రాయాన్ని అంగీకరించండి (ఇది యాభై సంవత్సరాలకు పైగా USA, ఇజ్రాయెల్ చేత వ్యతిరేకించబడుతుంది). ఈ సూటి మార్గానికి బదులు గాజాపై మారణహోమాన్ని ఇజ్రాయెల్ వ్యూహంగా ఎంచుకొంది. పౌరులపై భయంకరమైన దాష్టికాన్ని ప్రయోగించడం, సామూహిక శిక్షగా వారికి ఆహారం అందకుండా ఆకలితో మాడ్చడం అనేవి అనాదిగా వస్తున్న రాజ్యహింస లక్షణాలు. ఇవి ఇజ్రాయెల్‌కు మార్గదర్శక సూత్రాలు.

ఇజ్రాయెల్ తననుతాను ప్రపంచంలో అత్యంత ద్వేషించే దేశాలలో ఒకటిగా మార్చుకుంది. దాని చర్యలు నేరపూరితమైనవి, విధ్వంసకమైనవి మాత్రమే కాదు. దాని స్వంత దీర్ఘకాలిక భద్రతను కూడా నాశనం చేస్తున్నాయి. అమెరికా వెర్రి మద్దతు, అంతర్జాతీయ వ్యవహారాలలో ఐరోపా చేతకానితనం, తన స్వంత తీర్మానాలను తానే అమలుచేయలేని ఐక్యరాజ్యసమితి అశక్తత కారణంగా ఇజ్రాయెల్ తననితాను మదపుటేనుగులా భావిస్తూంది. ఇజ్రాయెల్ వద్ద అనేక వందల అణు ఆయుధాలు వున్నాయి. యుఎస్ ఇంటెలిజెన్స్ ప్రకారం, రసాయన, జీవ ఆయుధాలను అభివృద్ధిచేస్తోంది. మధ్యప్రాచ్యంలో అమెరికా శక్తికి, నేరాలకు ఇజ్రాయెల్ నిజమైన తోక.

వెస్ట్ బ్యాంకులో ఇజ్రాయెల్ వ్యూహం భిన్నంగా వుంటుంది. ఇది విస్తరణ, చట్టవిరుద్ధమైన విలీనం, ఎప్పుడో శక్తి విహీనమైన "పాలస్తీనా అథారిటీ" ని అధికారంలో వుందని భ్రమింపజేయటం, దాన్ని ఇజ్రాయెల్ సైనిక శక్తి క్రింద "జాతి వివక్ష" అమలు పరిచే తన ఏజంటుగా వుంచడం. ఈ వ్యూహాన్ని లోతుగా పరిశీలిద్దాం.

## 6. వెస్ట్ బ్యాంక్, ఇజ్రాయెలీ ఆక్రమణలు, 'వర్ణవివక్ష' వ్యవస్థ:

ఇజ్రాయెల్ గాజాలో నరమేధాన్ని వ్యూహంగా పాటిస్తుండగాబీ వెస్ట్‌బ్యాంక్ , ఇతర ఆక్రమిత పాలస్తీనా భూభాగాలలో (ఒపిటి) "సెట్లర్ కలోనియలిజం" ను వ్యూహంగా అనుసరిస్తుంది.

సెట్లర్ కలోనియలిజం అనేది అప్పటికే వారి తిష్ట వేసిన దేశాలలో విస్తరించడానికి చేపట్టే ఉద్యమం. స్థానిక జనాభాను వివిధ మార్గాల ద్వారా నాశనం చేయడం – ప్రధానంగా మారణహోమం ద్వారా, తమనుతాము దేశ యజమానులుగా పునర్నిర్మించుకోవడం, తమను తాము స్థానిక జనాభాగా తిరిగి ఆవిష్కరించుకోవడం. ఉదాహరణకు USA (రెడ్ ఇండియనులు), న్యూజిలాండ్ (మావోరీలు), ఆస్ట్రేలియా. ఇజ్రాయెల్ మన కళ్ళ ముందటి తాజా ఉదహరణ.

❖ 1967 నుండి ఇజ్రాయెల్ వందలాది ప్రాంతాలను ఆక్రమించింది. వీటికి వందల వేల మంది యూదులు (ఇజ్రాయెల్ పౌరులు) బదిలీ చేయబడ్డారు. వెస్ట్‌బ్యాంక్, జెరూసలేంపై "సార్వభౌమాధికారం" పొందటానికి ప్రాతిపదికగా భూమిపై శాశ్వత 'వాస్తవాలను' రూపొందించడానికి వారిని అక్కడ అమర్చారు. 1970లో 5000 మంది వలస ఆక్రమణ దారులతో మొదలుపెట్టి నేడు వెస్ట్ బ్యాంకులో 270 కంటే ఎక్కువ ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాలలో 4,65,000 మంది యూదులు స్థిరనివాసులు అయ్యారు. అదనంగా, తూర్పు జెరూసలేంలో 2,33,000 మంది యూదులు 14 ఆక్రమిత ప్రాంతాలలో స్థిర నివాసితులయ్యారు.

ఇజ్రాయెల్ 1990 లలో వెస్ట్‌బ్యాంక ్‌లోని కొన్ని భాగాలను కలిపేసుకోంటూ "విభజన గోడ" ను నిర్మించింది. ఈ గోడ వెస్ట్‌బ్యాంక్ అత్యంత ధనిక వ్యవసాయ భూములను, 1,00,000 పాలస్తీనియన్ల నివాసాలను ఇజ్రాయెల్‌లో కలిపేసుకుంది. ఈ పాలస్తీనియనులు క్రొత్త సెటిలర్ల నుండి నిరంతరం వేధింపులకు, హింసకు గురిచేయ బడుతున్నారు. ఆక్రమించిన వ్యవసాయ భూములకు పరిహారంగా కొన్నిసార్లు కేవలం ఒక సంవత్సరం పంట మార్కెట్ విలువను పాలస్తీనియన్లకు చెల్లించారు! ఐక్యరాజ్యసమితి ప్రత్యేక రిపోర్టర్ తన 2018 నివేదికలో ఇలా పేర్కొన్నాడు– "1967 నుండి ఉద్దేశ పూర్వకంగా ఆక్రమిత భూభాగంలో అంతర్జాతీయ మానవతా చట్టం ద్వారా నిషేధించబడిన, తిరిగి మార్చలేని మార్పులను చేయడం ద్వారా ఇజ్రాయెల్ వెస్ట్‌బ్యాంకును స్వాధీనం చేసుకోవడంలో నిరంతరం నిమగ్నం అయ్యింది. ఆక్రమిత ప్రాంతాల ఏర్పాటు,

26 లక్షల వెస్ట్‌బ్యాంక్ పాలస్తీనియన్ల భౌతిక , రాజకీయ చుట్టివేత; వెస్ట్ బ్యాంక్‌కు ఇజ్రాయెల్ చట్టాల పొడిగింపు; వివక్షాపూరిత పాలనా వ్యవస్థ సృష్టి; ఆక్రమిత వెస్ట్‌బ్యాంకులో పాలస్తీనియన్లకు సహజవనరులు, సామాజిక సేవల అందుబాటులో ఆస్తి, భూమి హక్కులలో అసమానత".

అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) జూలై 2004లో ఇచ్చిన "గోడ అభిప్రాయం" లో ఈ విధంగా తీర్పు ఇచ్చింది– "తూర్పు జెరూసలేం, చుట్టుపక్కల ప్రాంతాలతో సహా ఆక్రమించిన పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ గోడ నిర్మాణం, సంబంధిత పాలన అంతర్జాతీయ చట్టానికి విరుద్ధంగా వుంది. అంతర్జాతీయ చట్టం ప్రకారం ఇజ్రాయెల్ గోడ నిర్మాణాన్ని నిలిపివేయడం, కట్టిన దానిని కూల్చివేయడం, నిర్మాణానికి నష్టపరిహారం చెల్లించడం చేయాలి". ఇజ్రాయెల్ ప్రతిస్పందన ఏమిటి? వెకిలి నవ్వులూ, పిచ్చికూతలు!

2009, 2022 మధ్య, ఇజ్రాయెల్ కూల్చివేసిన వెస్ట్ బ్యాంకులోని పాలస్తీనా వాసుల నిర్మాణాల సంఖ్య 7500 కంటే ఎక్కువగా వుందని, ఫలితంగా 10,000 మందికి పైగా పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారని UN ఆఫీస్ ఫర్ ది కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమానిటేరియన్ అఫైర్స్ (UNOCHA) నివేదించింది. నివాసాలు, పొలాలు, ఆలివ్ తోటలు, ఇప్పటికే వున్న అన్ని నిర్మాణాలను నాశనం చేయడానికి, యుఎస్ సరఫరా చేసిన పెద్ద బుల్‌డోజర్లను దించారు. ఈ విధానాలు, చర్యలు ఇజ్రాయెల్‌ను "బుల్ డోజర్"కు పర్యాయపదంగా మార్చాయి.

ఇజ్రాయెల్ తనను తాను వెస్ట్ బ్యాంక్ తాత్కాలిక నివాసిగా పరిగణించదు. ఇది పాలస్తీనా వెస్ట్ బ్యాంకును తన సొంత "సార్వభౌమ" భూభాగంగా పరిగణిస్తుంది. దీనిని నియంత్రించడానికి, దోపిడీ చేయడానికి, శాశ్వతంగా పాలించడానికి తనకు అర్హత వుందని ఇజ్రాయెల్ పేర్కొంది. రహదారులు, వందల కిలోమీటర్ల గోడలు, ఇతర అడ్డంకులను నిర్మించడం ద్వారా, ఇజ్రాయెల్ అన్ని అక్రమ యూదు ప్రాంతాలనూ ఒకదానితో ఒకటి అనుసంధానం చేయడానికి ప్రయత్నిస్తోంది. ఇజ్రాయెల్ వెస్ట్ బ్యాంక్ స్వభావం, స్థితి, జనాభా కూర్పును సమూలంగా , శాశ్వతంగా మార్చడానికి ప్రయత్నిస్తోంది. చరిత్ర అంతటా వలస రాజ్యాలు ఇతరుల దేశాలలో చట్టవిరుద్ధంగా చేసిన పనిని ఇది ఇప్పుడు చేస్తోంది.

ఇజ్రాయెల్ అది ఏమి చేస్తుందో నొక్కి చెబుతుంది. అది జుడాయిజం పేరిట చేస్తుంది. కానీ జుడాయిజం ఒక మతం. జాతీయత కాదు. జియోనిజం ఒక వలసవాద ఉద్యమం. దూకుడు, విస్తరణవాద, జాత్యహంకారం, వేర్పాటువాదం దాని లక్ష్యాలు. మార్గాలలో ఫాసిస్ట్. ఇజ్రాయెల్ నేడు జాతి, మతం, జాతీయత ఆధారంగా బహిరంగంగా వేరు చేస్తుంది, వివక్ష చూపుతుంది.

పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ (వాస్తవానికి USA) రెండు మార్గాలు మాత్రమే ఇస్తుంది. 1) ఇజ్రాయెల్ బహిరంగ జైలులో జీవితాన్ని అంగీకరించి, పరిమిత

స్వయంప్రతిపత్తి, ఇజ్రాయెల్‌లో ఎటువంటి హక్కులు లేకుండా తక్కువ వేతనం పొందే బందీ కార్మికులుగా పనిచేసే హక్కును పొందడం, లేదా 2). స్వల్పంగా అయినా ప్రతిఘటించి, భయంకరమైన జైళ్లలో నివసించడం; ఇళ్ల కూల్చివేతలు, అరెస్టులు, బహిష్కరణలు, హత్యలు వంటి సామూహిక శిక్షలకు లోబడి ఉండాలి.

ఈ క్రూరమైన, అనాగరిక చర్యలను దాచడానికి "నాగరిక" పాశ్చాత్య దేశాలు, వాటి టీవీ ఛానళ్లు మధ్యతరగతి మేధావుల నుండి "సమ్మతిని తయారు చేయడానికి" చాలా అపోహలను సృష్టిస్తాయి. వారు తమను తాము "శాంతి ప్రోత్సాహకులు" గా, తమను వ్యతిరేకిస్తున్న ఇతరులను 'ఉగ్రవాదులు' గా చూపించుకుంటారు. భయానక యూదు వ్యతిరేక చరిత్రతో నిండిన అదే దేశాలు ఈ అపోహలను ఎవరైన విమర్శిస్తే "యూదు వ్యతిరేకత" (anti-Semitism) గా ముద్రవేస్తాయి.

పాలస్తీనా అథారిటీ ఇజ్రాయెల్‌తో చర్చలు జరిపి కూడా ఏమీ సాధించకపోవడం, సెటిల్మెంట్ కార్యకలాపాలు పెరుగుతున్నప్పటికీ భద్రతా సహకారాన్ని కొనసాగించడంతో దాని అధికారాన్ని, విశ్వసనీయతను బలహీనపరిచింది. అది హమాస్, హిజ్బుల్లాహ్ వంటి ఇస్లామిస్టుల సాయుధ ప్రతిఘటనకు దారితీసింది.

ఈ 80 ఏళ్ల నేపథ్యంతో మనం 2023 అక్టోబర్ 7న దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడిని చూడాలి. హమాస్ 1139 మంది ఇజ్రాయిలీలను (కొంతమంది సైనిక సిబ్బందితో సహా) చంపి, 251 మందిని బందీలుగా తీసుకుంది (వారిలో సగం మంది విదేశీ పౌరులు). యుద్ధం ప్రారంభంలో హమాస్ బందీలకు బదులుగా ఇజ్రాయెల్ ఖైదు చేసిన పాలస్తీనియులు అందరినీ (సుమారు 5000 మంది) విడుదల చేయాలని ప్రతిపాదించింది. కానీ ఇజ్రాయెల్ అంగీకరించలేదు. తదనంతరం కొంతమంది పాలస్తీనా బందీలకు బదులుగా 117 మంది బందీలను విడుదల చేశారు. ఇంకా సుమారు 100 మంది హమాస్ బందిఖానాలో వున్నారు. మిగిలిన వారు యుద్ధంలో చనిపోయారు. హత్యకు గురైన హమాస్ నాయకుడు యాహ్యా సిన్వర్ మాటల్లో చెప్పాలంటే –"పాలస్తీనియన్లు 'బుద్ధిగా ప్రవర్తించే బాధితులు' గా వుండాలని ప్రపంచం ఆశించరాదు".

ప్రతిస్పందన పేరుతో ఇజ్రాయెల్ గాజాలో అత్యంత భయంకరమైన "మారణ హోమం" నిర్వహించడం హమాస్ చర్యతో పోలిస్తే ఎంతో అసమానంగా, క్రూరంగా వుంది. గత 425 రోజుల్లో ఇజ్రాయెల్ విజయవంతంగా ఒక గొప్ప ఫలితాన్ని సాధించింది. మొత్తం ప్రపంచం నేరపూరిత ఇజ్రాయెల్ ప్రభుత్వాన్ని, దాని సైన్యాన్ని మాత్రమే ద్వేషించడం లేదు, నరహంతక నెతన్యాహుకు మద్దతుదారు అయిన, ప్రతీ యూదును ద్వేషిస్తుంది.

కొనసాగుతున్న జాత్యహంకార నరమేధంలో కొన్ని ముఖ్యమైన పరిణామాలను, ముఖ్యమైన అంతర్జాతీయ ప్రతిస్పందనలను చూద్దాం.

## 7. జాత్యహంకార నరమేధం చుట్టూ ముఖ్యమైన పరిణామాలు:

ఈ వ్యాసం ప్రారంభంలో వివరించిన మారణహోమం స్థాయితో పాటు గాజాపై ఈ తాజా ఇజ్రాయెల్ యుద్ధంలో కొన్ని ముఖ్యమైన అంశాలు వున్నాయి. అవి క్లుప్త వివరణతో క్రింద ఇవ్వబడ్డాయి. అన్నీ సమానంగా ముఖ్యమైనవి; అవి ప్రాముఖ్యత ప్రకారం జాబితా చేయబడలేదు.

**అవి:**

❖ 2023 అక్టోబరు 7న హమాస్ తన దాడిలో 251 మంది బందీలను తీసుకుంది. (ఇజ్రాయెల్‌కు చెందిన ఒక సైనికుడిని బందీగా తీసుకున్న 1982 నాటి అనుభవం వారికి బందీల ప్రాముఖ్యతను ఇచ్చి వుండవచ్చు). భయంకరమైన ఇజ్రాయెల్ దాడులు జరుగుతున్నప్పటికీ ఒక సంవత్సరానికి పైగా 100 మందిని హమాస్ దాచగలగడం గాజాలో వారికున్న సామూహిక మద్దతును, వారి నెట్వర్క్ పరిధిని సూచిస్తుంది.

❖ ఇజ్రాయెల్ గాజా ప్రజానీకాన్ని వారి ఇళ్ళు, నివాస స్థలాలను వదిలి పొమ్మని ఆదేశించడం, బాంబు దాడులు చేస్తామని బెదిరించడం హేయమైన, నీచమైన చర్య. ఇలా భయపెట్టబడి చాలామంది చాలాసార్లు పారిపోయిన తర్వాత వారికి అర్థమయినది ఏమిటంటే గాజాలో సురక్షితమైన ప్రదేశం లేదని, రోడ్ల మీదో లేదా తెలియని ఎదో ప్రాంతంలో హత్యకు గురికావడమేనని. అసలు ఇజ్రాయెల్ మొత్తం ప్రణాళిక 'గాజాను తుడిచివేయడం' అని అనిపిస్తుంది.

❖ గాజాలో మరణించిన 44,000 మందిలో 70 శాతం మంది మహిళలు, పిల్లలు వున్నారు. వారిలో దాదాపు సగం మంది పిల్లలు వున్నారు. ఈ ఘోరమైన దాడులకు పాల్పడిన ఆ మూర్ఖులను ఖండించడానికి ఏ శాపం సరిపోదు. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ భవిష్యత్ తరం పాలస్తీనియన్లను భూమి నుండి తుడిచివేయడానికి ప్రయత్నిస్తోంది.

❖ **రఫా క్రాసింగ్ ప్రాముఖ్యత:** ఈజిప్ట్, గాజా మధ్య వున్న ఈ చెక్‌పోస్ట్, క్రాసింగ్ ముఖ్యమైన పాత్ర పోషించింది. మొదటిది: ఇజ్రాయెల్ గాజా ప్రజలందరినీ దక్షిణం వైపు వెంబడిస్తున్నప్పుడు ఈ క్రాసింగ్ ద్వారా పాలస్తీనియన్లు ఈజిప్టులోకి వరదలుగా రావడానికి అనుమతించకుండా ఈజిప్ట్ దానిని మూసివేసింది. రెండవది: 'ప్రజల ఆకలి'ని యుద్ధ సాధనంగా ఉపయోగించడానికి గాజాలోకి ఈ క్రాసింగ్ ద్వారా వచ్చే మానవతా సహాయాన్ని ఇజ్రాయెల్ అడ్డుకుంది. మూడవది: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కొంతమంది రోగులను చికిత్స కోసం ఈజిప్టు ఆసుపత్రులకు పంపడానికి ఈ క్రాసింగ్ ఉపయోగించబడింది. చివరగా –విడుదల చేసిన బందీలను ఇజ్రాయెల్‌కు అప్పగించడానికి ఈ క్రాసింగ్‌ను రెడ్‌క్రాస్ ఉపయోగించింది.

❖ పాలస్తీనియన్లకు మానవతా సహాయంగా అందించే ఆహారం, మందులు, ఇంధనాన్ని అడ్డుకోవడం మొదటి తరగతి నేరపూరిత చర్య. యుద్ధానికి ముందు ప్రతిరోజూ

వందలాది ట్రక్కులు గాజాలోకి ప్రవేశించేవి. యుద్ధ సమయంలో ఇజ్రాయెల్ మానవతా సహాయానికి రాకపోకలను "మంజూరు చేసాక" రోజుకు పదుల సంఖ్యలో కూడా ట్రక్కులు గాజాలోకి ప్రవేశించట్లేదు. 2024 అక్టోబరు తరువాత ఇజ్రాయెల్ ఉత్తర గాజాను పూర్తిగా దిగ్బంధం చేసి, దానిపై ప్రతిరోజూ బాంబు దాడులు, షెల్లింగ్ చేయడం అత్యంత ఘోరమైన చర్య.

❖ ఈ కట్టడులతో ఆహారం, నీరు అందక పాలస్తీనా పిల్లలు మురికిగుంటల నుండి నీరు తీసుకోవడం, నేలపాలైన పిండిని ఏరుకోవడం చూస్తే నిజంగా హృదయ విదారకం. వారి దేవుడు ఈ నేరాలకు పాల్పడినందుకు వారిని నరకంలో వేయిస్తాడని ఎవరైనా ఆశించవచ్చు.

❖ **ఆసుపత్రులపై దాడులు:** ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం ఇజ్రాయెల్ చేసిన అత్యంత ఘోరమైన నేరం. వారి సాకు హమాస్ కార్యకర్తలను "వేటాడటం". దాడిచేసిన అన్ని ఆసుపత్రుల డైరెక్టర్లు హమాస్ తమ ఆసుపత్రులను దాచుకునే ప్రదేశాలుగా ఉపయోగించడం లేదని పేర్కొన్నారు. దాడి చేసిన ముఖ్యమైన ఆసుపత్రులు:

- అల్-అహ్లీ అరబ్ హాస్పిటల్
- అల్-షిఫా హాస్పిటల్
- ఇండోనేషియా ఆసుపత్రి
- అల్-ఖుద్స్ హాస్పిటల్
- అల్-అమర్ హాస్పిటల్
- టర్కీ-పాలస్తీనా ఫ్రెండ్షిప్ హాస్పిటల్
- జోర్డాన్ ఫీల్డ్ హాస్పిటల్
- అల్-అవ్దా హాస్పిటల్, ఇప్పుడు తాజాది
- కమల్ అద్వాన్ హాస్పిటల్.

2023 అక్టోబరు 7 నుండి గాజాలో 165 "ఆరోగ్య సంరక్షణ కేంద్రాలపై దాడులు" జరిగాయని ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదించింది. పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం, ఇజ్రాయెల్ సైనిక దాడులు; విద్యుత్, ఇంధనాన్ని నిలిపివేయడం వల్ల గాజా అంతటా 35 ఆసుపత్రులలో 26 పనిచేయడం లేదు. ఇజ్రాయెల్ దళాలు రెడ్ క్రాస్ లేదా రెడ్ క్రెసెంట్ చిహ్నాలతో గుర్తించబడిన అంబులెన్స్ లపై కూడా దాడి చేశాయి.

ఆసుపత్రులను పదేపదే లక్ష్యంగా చేసుకోవడం ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను పూర్తిగా విచ్ఛిన్నం చేయడానికి దారితీసింది. ఇది ఇప్పటికే గాజా 16 సంవత్సరాల దిగ్బంధం ద్వారా దెబ్బతింది.

❖ **హమాస్ కు మద్దతు:** హిజ్బుల్లా (లెబనాన్‌లో వున్న) యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు, ఇస్లామిక్ గ్రూప్ ఆఫ్ సిరియా, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ మాత్రమే ఇజ్రాయెల్ – గాజా యుద్ధంలో హమాస్‌కు ప్రత్యక్ష మద్దతు ఇచ్చాయి. ఈ అంతర్జాతీయ మద్దతుదారులలో, ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్ సంబంధిత నౌకలపై యెమెన్ దాడులు నెతన్యాహు యుద్ధాన్ని మొత్తం ప్రపంచ దృష్టికి తీసుకువచ్చాయి. దాని బలం, నిబద్ధతతో ఇజ్రాయెల్ పై క్షిపణి దాడులు చేసిన హిజ్బుల్లా మద్దతు హమాస్‌కు ముఖ్యమైనది. ఇరాన్ మద్దతు నిజంగా కొంతవరకు ఇజ్రాయెల్‌కు ప్రతిబంధకంగా వుంది. ఎందుకంటే తెగేదాకా వచ్చిందంటే ఇరాన్‌తో ఇజ్రాయెల్ సరిపోల్చడం, ఎదుర్కోవడం సాధ్యం కాదు.

ప్రపంచంలో ఏ లౌకిక దేశం కూడా ఇజ్రాయెల్‌ను నేరుగా వ్యతిరేకించకపోవడం (మనం ఇక్కడ ఐక్యరాజ్యసమితి ద్వారా దౌత్య మద్దతు గురించి మాట్లాడటం లేదు), అది చేస్తున్న ఘోరమైన నేరాలకు వ్యతిరేకంగా హెచ్చరించపోవడం దురదృష్టకరం.

❖ **విద్యార్థుల అంతర్జాతీయ నిరసనలు:** ప్రపంచవ్యాప్తంగా వున్న విశ్వవిద్యాలయ విద్యార్థులు పాలస్తీనియన్లకు సంఘీభావం తెలుపుతూ ఇజ్రాయెల్ గాజాపై చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. పాలస్తీనియన్లకు మద్దతుగా యూదు విద్యార్థులు కూడా అనేక నిరసనలకు నాయకత్వం వహిస్తున్నారు (నెతన్యాహు–దయచేసి గమనించండి, వారు 'సెమిటిక్ వ్యతిరేకులు' కాదు). అమెరికా నగరాలు, లండన్, పారిస్, బెర్లిన్, ఆమ్ స్టర్ డామ్, ఆస్ట్రేలియా, స్పెయిన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండోనేషియా మొదలైన దేశాలలో విద్యార్థులు, పాలస్తీనియన్ల మద్దతుదారులచే పెద్దఎత్తున నిరసనలు జరిగాయి. ఇజ్రాయెల్‌కు ఆయుధాలను సరఫరా చేయవద్దని, దుష్ట దేశమైన ఇజ్రాయెల్‌ను వేరుచేయాలని వారు తమ దేశాలను డిమాండ్ చేశారు. కొన్ని నిరసనలలో, ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చే యూదులపై కూడా దాడి జరిగింది (రష్యా, ఆమ్‌స్టర్ డామ్‌లో...). నెతన్యాహు, అతని ముఠా చేసిన మానవతా నేరాలకు యూదు ప్రవాసులు (అమెరికలోని ధనవంతులైన యూదులు మినహా) వ్యతిరేకంగా ఉండటం చాలా ముఖ్యమైనది. విద్యార్థుల నిరసనలు భవిష్యత్తు పట్ల కొంత ఆశను కలిగిస్తున్నాయి.

❖ **ఇజ్రాయెల్ లో నిరసనలు :** యుద్ధం ప్రారంభం నుండే, ఇజ్రాయెలీ బందీల బంధువులు 10వేల మంది ఇతరుల మద్దతుతో ఇజ్రాయెల్ లో నిరసనలు చేపట్టారు. ఒక విధంగా, అవి నెతన్యాహుకు వ్యతిరేకంగా టెల్ అవీవ్ లో అంతకుముందు వారపు నిరసనల కొనసాగింపు ( సుప్రీంకోర్టు అధికారాలను అరికట్టడానికి, (తన)ప్రధాన పదవిని న్యాయ పరిధి నుండి తప్పించడానికి ఆయన తీసుకున్న చర్యలకు వ్యతిరేకంగా). కానీ 'బందీ–విడుదల' నిరసనలకు బందీల బంధువులు నాయకత్వం వహించారు. ఏదైనా "కాల్పుల విరమణ, బందీల విడుదల" ఒప్పందాలకు నెతన్యాహు పెద్ద అడ్డంకి అని వారు పేర్కొన్నారు.

ఐడిఎఫ్ ముఖ్యమైన పాలస్తీనా నాయకులను హత్య చేసినప్పుడు లేదా "తొలగించినప్పుడు" ఇజ్రాయెల్‌లో యూదు ఫండమెంటలిస్ట్ ర్యాలీలు, నృత్యాలు కూడా జరుగుతాయి.

❖ IDF + **మొసాద్ చేత హమాస్, హిజ్బుల్లా, ఇరానియన్ నాయకుల హత్య:**

ఇరాన్, లెబనాన్ వంటి విదేశీ నేలపై ముఖ్యమైన నాయకుల హత్య వంటి ఘోరమైన ఉగ్రవాద కార్యకలాపాలను ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ మొసాద్ చేపట్టింది, ఐడిఎఫ్ ఆచరించింది. ఇజ్రాయెల్ చేత హత్య చేయబడిన అగ్ర నాయకులు ఇలా వున్నారు.

- జూలై 31 న హమాస్‌కు చెందిన ఇస్మాయిల్ హనియే
- జూలై 24 న హమాస్‌కు చెందిన మహ్మద్ డీఫ్
- అక్టోబర్ 7 న హమాస్‌కు చెందిన యాహ్యా సిన్వార్
- హిజ్బుల్లాకు చెందిన హసన్ నస్రల్లా – సెప్టెంబర్ 27 న
- సెప్టెంబరు 27న హిజ్బుల్లాకు చెందిన అలీ కరాకి
- సెప్టెంబరు 20 న హిజ్బుల్లాకు చెందిన ఇబ్రహీం అక్విల్

ఈ నాయకులందరూ మోసాద్ ( సిఐఎ సహాయంతో) సేకరించిన ఇంటెలిజెన్స్ ను ఉపయోగించి ఆ దేశాల సార్వభౌమత్వాన్ని విస్మరించి, వైమానిక, డ్రోన్ దాడుల ద్వారా చంపబడ్డారు.

ఇరాన్, ఇజ్రాయెల్ పై దాని సామర్థ్యాలను చూపించడానికి రెండుసార్లు క్షిపణులతో దాడి చేసింది. అంతకంటే ఎక్కువ యుద్ధాన్ని నేరుగా మధ్యప్రాచ్యంలోకి విస్తరించడానికి ఇష్టపడలేదు.

❖ **లెబనాన్‌పై యుద్ధం :** హిజ్బుల్లాను నిర్మూలించాలనే తన కొత్త "యుద్ధ లక్ష్యాన్ని" ప్రకటించడం ద్వారా ఇజ్రాయెల్ అక్టోబర్ 2024 లో లెబనాన్‌కు తన యుద్ధాన్ని విస్తరించింది. ఇది బీరుట్ (లెబనాన్ రాజధాని), దక్షిణ లెబనాన్ గ్రామాలు, పట్టణాలపై దాదాపు నలభైరోజుల పాటు బాంబు దాడులు చేసింది. ఈ చర్యలన్నీ ఇరాన్, అరబ్ దేశాలను రెచ్చగొట్టడానికి, యుద్ధాన్ని తీవ్రతరం చేయడానికి అని చాలామంది అనుమానిస్తున్నారు. తద్వారా ఇజ్రాయెల్ అమెరికాను నేరుగా యుద్ధంలోకి లాగగలదు. ఇజ్రాయెల్ యుద్ధాన్ని తీవ్రతరం చేసిన ప్రతిసారీ, అమెరికా దాడిచేయబడిన ఇతర దేశాలకు 'యుద్ధాన్ని తీవ్రతరం చేయవద్దని' సలహా ఇస్తుంది.

ఇజ్రాయెల్ 1982 నాడు వైమానిక బాంబు దాడులలో మొత్తం 40,000 మందిని పొట్టనబెట్టుకున్న ఆనాటి యుద్ధాన్ని లెబనాన్‌కు గుర్తుచేస్తోంది. కానీ ఇప్పటికీ లెబనాన్‌లో హిజ్బుల్లాకు మద్దతు పటిష్టంగా కనిపిస్తోంది.

❖ **ఐక్యరాజ్యసమితిపై దాడులు:** ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఇజ్రాయెల్ – గాజా యుద్ధంపై తన మనసులో మాట చెప్పినప్పటి నుండి (యుద్ధానికి నిజమైన దోషి

ఇజ్రాయెల్ అని అన్ని దేశాలకు గుర్తు చేయడం) ఐక్యరాజ్యసమితి ఇజ్రాయెల్‌కు అతిపెద్ద లక్ష్యంగా మారింది. ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయెల్ రాయబారి అయిన డానీ డానన్ అటువంటి అహంకారంతో మాట్లాడడం టీవీలో చూసినప్పుడు మనకు అసహ్యం కలుగుతుంది. (యు.ఎస్. రాయబారి లిండా థామస్ తన యుఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రసంగాలలో– రూపం, సారం రెండింటిలోనూ సమానంగా తిప్పికొట్టారు).

ఎటువంటి అపరాధనా భావం లేకుండా ఐక్యరాజ్యసమితి తీర్మానాలను పదేపదే ఉల్లంఘించడంతో పాటు, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఇజ్రాయెల్ లో ప్రవేశించలేరని ప్రకటించే ధైర్యం ఇజ్రాయెల్‌కు వుంది. విశ్వాసఘాతుకమైన దుష్ట దేశంగా మారిన దేశాన్ని (1947లో) ఐక్యరాజ్యసమితి సృష్టించినందుకు కొన్నిసార్లు దానికి తగిన శాస్తి జరిగింది అనిపిస్తుంది.

ఇజ్రాయెల్‌లో అప్రమేయంగా ఇజ్రాయెల్ సైనిక నియంత్రణలో వున్న పాలస్తీనాలో యుఎన్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ (యుఎన్ఆర్డబ్ల్యుఎ) కార్యకలాపాలను 28, అక్టోబర్ 2024న ఒక చట్టం ద్వారా నిషేధించింది. గాజాలో నిరాశ్రయులైన, నిస్సహాయ బాధితులకు సాధ్యమైనంత ఉత్తమమైన సహాయ కార్యకలాపాలు చేస్తున్న ఏకైక సంస్థ యుఎన్ఆర్డబ్ల్యుఎ.

వెస్ట్ బ్యాంక్, గాజా, లెబనాన్, జోర్డాన్ అంతటా దాదాపు అరవై లక్షల పాలస్తీనా శరణార్థులకు యుఎన్ఆర్డబ్ల్యుఎ మాత్రమే సహాయ కార్యక్రమాలు చేపడుతోంది. ఇది 33,000 మందికి ఉపాధి కల్పిస్తుంది. 150 ఆసుపత్రులను, పెద్ద సంఖ్యలో పాఠశాలలను నడుపుతుంది. యుఎన్ఆర్డబ్ల్యుఎ నడుపుతున్న పాఠశాలల్లో ఆరు లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

ఇజ్రాయెల్ 'ఆకలి వ్యూహంలో' ఒక భాగం ఐక్యరాజ్యసమితి నుండి కూడా మద్దతును తిరస్కరించడం. ఆ ఆకలి వ్యూహంలో భాగంగా అది ఏమి చేసిందో చూడండి.

- గాజాలో 233 మంది ఐక్యరాజ్యసమితి ఉద్యోగులను హతమార్చింది.
- గాజాలోకి ప్రవేశించే సహాయక ట్రక్కులను అడ్డుకున్నది.
- సహాయం పొందడానికి గుమిగూడిన ప్రజలపై కాల్పులు జరిపింది.
- పాఠశాల భవనాలపై బాంబు దాడి చేశారు.
- ఐక్యరాజ్యసమితి వాహనాలు, కాన్వాయ్‌లపై కాల్పులు జరిపారు.
- ఒక నెల కన్నా ఎక్కువ కాలం ఉత్తర గాజా మొత్తాన్ని ముట్టడించారు.
- గాజాకు నీటి సరఫరాను నిలిపివేశారు.
- చివరగా యు.ఎన్.ఆర్.డబ్ల్యూ.ఏ. కార్యకలాపాలను నిషేధించారు.

**ఇదంతా ఒక వాస్తవాన్ని సూచిస్తుంది:**

ఇజ్రాయెల్ ఒక నాగరిక దేశం కాదు. ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం పొందటానికి అర్హత లేదు. దానిని వెంటనే బహిష్కరించాలి.

❖ **జర్నలిస్టులపై దాడి:** ఇజ్రాయెల్ సైన్యం 2023 అక్టోబర్ 7 నుండి గాజాలో 180 మంది జర్నలిస్టులు, మీడియా వ్యక్తులను హతమార్చింది. ఐడిఎఫ్ చంపాలనుకునే ఎవరినైనా ఉగ్రవాదులుగా, లేదా హమాస్‌తో సంబంధం వున్నవారనో, లేక హింసను ప్రేరేపిస్తున్నారనో ముద్ర వేస్తుంది. వారి ఆరోపణలకు ఎటువంటి రుజువులను చూపించరు. ఎవరికీ జవాబుదారీగా వుండరు. వాస్తవానికి, పాశ్చాత్య దేశాలలోని చాలా టీవీ ఛానళ్లు, ఇతర మాస్ మీడియా (వారి అనుబంధ) నేరస్థులనే హీరోలుగా ఆరాధిస్తారు. కార్పొరేట్ యాజమాన్యం, హాలీవుడ్ నిజమైన ప్రభావం. ప్రచార మాధ్యమాలకు యుద్ధం లేదా హింస "బ్రేకింగ్ న్యూస్" మాత్రమే. వారు బాధితుల గురించి, అన్యాయాల గురించి ఏమీ పట్టించుకోరు.

కానీ అల్ జజీరా వంటి కొన్ని టీవీ ఛానళ్లు , కొన్ని ఆన్లైన్ పోర్టల్స్ నమ్మదగినవి, నిజాయితీగా వున్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన నెతన్యాహు సత్యానికి శత్రువు, అబద్ధాల ప్రధాన అభ్యాసకుడు. కాబట్టి సహజంగానే వారు నిజాయితీగా నివేదించడాన్ని ద్వేషిస్తారు, మంచి పాత్రికేయులను చంపుతారు.

వాస్తవానికి, గాజా యుద్ధానికి ముందే, 2022లో, ఆక్రమిత వెస్ట్‌బ్యాంకులో షిరీన్ అబూ అక్లేహ్‌ను ఇజ్రాయెల్ దళాలు కాల్చి చంపాయి. ఆమె ప్రెస్ అని ధరించి వున్నా ఇజ్రాయెల్ సైనికులు ఆమెను తలపై కాల్చి ఉద్దేశపూర్వకంగానే చంపారు. రామల్లాకు ఉత్తరాన వున్న జెనిన్ నగరంలో ఇజ్రాయెల్ సైన్యం దాడుల గురించి ఆమె నివేదిస్తోంది. ఆమె పాలస్తీనా–అమెరికా పౌరురాలు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగలేదు. ఉద్దేశపూర్వక హత్యకు జవాబుదారీతనం లేదు. ఇజ్రాయెల్, అమెరికాలకు సిగ్గు, లజ్జ లేదు.

ఒక గంట నోటీసుతో ఇజ్రాయెల్‌లో తన కార్యకలాపాలను నిలిపివేయాలని అల్ జజీరాను ఆదేశించింది.

❖ **అమెరికా అత్యున్నత స్థాయి వంచన:** ప్రస్తుత గాజా మారణహోమం సమయంలో, అమెరికా అత్యున్నత స్థాయి వంచన అద్భుతంగా కనబడుతోంది. బాంబు దాడి, నరమేధపు దాడుల బాధితులకు ప్రతిరోజూ "సంయమనం పాటించండి", "ఉద్రిక్తతలను పెంచవద్దు", "ఇజ్రాయెల్‌కు ఆత్మరక్షణ హక్కు ఉంది" అని చెప్పడం జరుగుతోంది. యు.ఎస్. అధ్యక్షుడు – భారీ ఆయుధాలు , మందుగుండు సామగ్రితో పాటు, ఇజ్రాయెల్‌కు 'క్లస్టర్ బాంబులను' పౌరులపై ఉపయోగించదానికి సరఫరా చేశారు. ఇవి యుద్ధాలలో కూడా నిషేధించబడ్డాయి. అతను గాజాలో మరణించిన వారి సంఖ్యను తాను నమ్మనని నిస్సిగ్గుగా చెప్పడానికి సాహసించాడు. అతను, అతని దేశం USA, ఈ నరమేధానికి గుడ్డి, చెవిటివానిగా ఉండదలిచారు. ఈ ఒక్క సంవత్సరం యుద్ధంలో యు.ఎస్. విదేశాంగ కార్యదర్శి మధ్యప్రాచ్యంలో పన్నెండు సందర్శనలను చేశారు. ప్రతిసారీ నెతన్యాహు చేత మోసం చేయబడి, చెంపదెబ్బ కొట్టబడ్డారు.

నవంబర్ 2023 నుండి నవంబర్ 2024 వరకు యుఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ గాజాలో కాల్పుల విరమణ తీర్మానాలను అమెరిక నాలుగుసార్లు వీటో చేసింది. మిగతా వారందరూ దీనికి ఓటు వేశారు. ఇది ప్రతిపాదించి, భద్రతా మండలిలో ఏకగ్రీవంగా ఆమోదించబడిన ఒక తీర్మానాన్ని నెతన్యాహు ఎడమకాలుతో తన్నాడు.

ఇప్పటికీ అమెరికాకు సిగ్గు లేదు. ఇజ్రాయెల్ ప్రధాని తనను చెంపదెబ్బ కొట్టిన ప్రతిసారీ ఇజ్రాయెల్ కు తన “ఉక్కు మద్దతు”ను పునరావృతం చేస్తారు. **దీనికి కారణాలు:** ఇది మధ్యప్రాచ్యంలో ‘స్థానిక గూండా’ ను కోరుకుంటుంది. అమెరికాలోని ఇజ్రాయెల్ అనుకూల లాబీల నుండి అధ్యక్ష ఎన్నికలకు డబ్బు ఏర్పాటుచేస్తుంది. ఇంకా దాని సైనిక పరిశ్రమను రక్షించాలి.

USA (మరియు ఇతర పాశ్చాత్య దేశాలు), వారి తమ పౌరుడు ఒక్కరు గాయపడ్డా లేదా చంపబడ్డా లేదా బంధింపబడ్డా నానా రబసా చేస్తారు. కానీ 44,000 మంది పాలస్తీనియన్లు చంపబడ్డారు, 1,06,000 మంది గాయపడ్డారు. గాజాలో మొత్తం జనాభాకు ప్రతి సౌకర్యమూ నిరాకరించబడుతోంది. ఆకలితో చంపే వ్యూహం అమలవుతోంది. బహుశా వారు రేపు అపరాధం నుండి బయటపడవలసి వచ్చినప్పుడు, వారు అర్థంలేని, మానవత్వానికి వ్యతిరేకంగా ఏ నేరం చేశారో, ఇంకా చేస్తున్నారో వారికి చెప్పడానికి మరొక “గ్రెటా థన్బర్గ్” ను కనుగొంటారు .

❖ **చైనా మౌనం:** అమెరికా శకం ముగిసినందున ప్రపంచ నాయకత్వాన్ని తీసుకోబోయే చైనా, గాజాలో ప్రస్తుత మారణహోమం అంతటా నిశ్శబ్దాన్ని కొనసాగించింది. వాస్తవానికి ఇది ఐక్యరాజ్యసమితిలో కాల్పుల విరమణ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించింది దాని భాషపై ఏ రాద్ధాంతం చేయకుండానే. యుఎన్ఎస్సిలో అమెరికా ముసాయిదా తీర్మానానికి కూడా మద్దతు ఇచ్చింది.

చైనా మౌనానికి ప్రస్తుతానికి మనకు కారణం తెలియక పోవచ్చు. బహుశా అది స్థానిక జనాభా నుండి పరిష్కారం కావాలని కోరుకుంటుంది లేదా అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌కు తగిన పాఠం నేర్పించాలని కోరుకోవచ్చు. లేదా అమెరికాతో దాని వాణిజ్యం గురించి ఆందోళన చెందవచ్చు. ఒక్క విషయం స్పష్టంగా వుంది. పాలస్తీనియన్ల తరపున పోరాటం చేస్తోన్న నాయకత్వాన్ని మత ఛాందసవాదం అని వంకలు పెట్టి పాలస్తీనియన్లకు ఎటువంటి నష్టం చేయలేదు.

మరోవైపు, జూలై 2024 లో, పద్నాలుగు వేర్వేరు పాలస్తీనా గ్రూపులు బీజింగ్‌లో సమావేశమై, జూలై 23 న ఒక ఒప్పందంపై సంతకం చేశాయి. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా తన మంచి కార్యాలయాలను చర్చలకు అందించి ఈ ఒప్పందానికి చేరుకోవడానికి వీలు కల్పించింది. ఈజిప్ట్, అల్జీరియా, సౌదీ అరేబియా, ఖతార్, జోర్డాన్, సిరియా, లెబనాన్, టర్కీ, రష్యా ప్రతినిధులు ఈ చర్చలకు హాజరయ్యారు. చర్చలు, ఒప్పందానికి చేరుకోవడంలో ప్రధానంగా పాల్గొన్న వారు ఫతాహ్, హమాస్.

ఒప్పందం ప్రకారం, ఈ గ్రూపులు "ఈజిప్ట్, అల్జీరియా, చైనా, రష్యా సహాయంతో పిఎల్ఓ ఫ్రేమ్ వర్క్ కింద అన్ని పాలస్తీనా గ్రూపులు కలిగి వున్న సమగ్ర పాలస్తీనా జాతీయ ఐక్యతను సాధించడానికి, జెరూసలేంను దాని రాజధానిగా... స్వతంత్ర పాలస్తీనా రాజ్యాన్ని స్థాపించడానికి కట్టుబడి ఉంటాయని" అంగీకరించాయి.

ఇజ్రాయెల్ ఆక్రమణను ప్రతిఘటించే హక్కు, పాలస్తీనియన్లను వారి భూమి నుండి గెంటివేసే ఏ ప్రయత్నాన్నైనా అడ్డుకునే హక్కు ఐక్యరాజ్యసమితి శాసనం ప్రకారం తమకు వుందని ఈ ప్రకటన నొక్కి చెప్పింది. మలేషియా, పాకిస్తాన్, టర్కీ కూడా ఈ ఒప్పందానికి మద్దతు ఇచ్చాయి. ఊహించినట్లుగా, అమెరికా, ఇజ్రాయెల్, జర్మనీ ఈ ఒప్పందాన్ని విమర్శించాయి.

క్షేత్రస్థాయిలో 'ఒప్పందం' ఎంత ప్రభావవంతంగా వుంటుందో, చైనా ఎంత చురుకైనదిగా వుంటుందో భవిష్యత్తు మనకు తెలియజేస్తుంది.

## 8. ముఖ్యమైన అంతర్జాతీయ ప్రతిస్పందనలు:

అమెరికా, కొన్ని పాశ్చాత్య దేశాలు మినహా గాజాలో 450 రోజుల మారణహోమం జరిపిన ఇజ్రాయెల్ క్రూరత్వం, అహంకారంపై చాలా దేశాలు విసుగు చెందాయి. అమెరికా ఆధిపత్య ప్రభావం వున్నప్పటికీ కొన్ని దేశాలు, సంస్థలు కొన్ని చర్యలు తీసుకునే సాహసం చేసాయి. **అవి:**

దౌత్య సంబంధాల విరమణ; పదకొండు దేశాలు – బహ్రెయిన్, బెలిజ్, బొలీవియా, బ్రెజిల్, చిలీ, చాడ్, కొలంబియా, హొండురాస్, జోర్డాన్, టర్కీ , దక్షిణాఫ్రికా – ఇజ్రాయెల్ నుండి తమ రాయబారులను ఉపసంహరించుకున్నాయి లేక ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలను తెంచుకున్నాయి. అదనంగా, ఏడు దేశాలు "ఇండోనేషియా, మలేషియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ మొదలైన అంతర్జాతీయ మానవతా చట్టాలను ఆమోదయోగ్యం కాని విధంగా ఉల్లంఘించినందుకు" ఇజ్రాయెల్ ను తీవ్రంగా ఖండించాయి.

గాజా యుద్ధం ప్రారంభమైన తరువాత పెద్ద సంఖ్యలో దేశాలు ఇప్పటికే పాలస్తీనా రాజ్యాన్ని గుర్తించాయి. ఈ ఒక్క సంవత్సరంలో, మరో తొమ్మిది దేశాలు పాలస్తీనాను గుర్తించాయి.

పైన పేర్కొన్న వాస్తవాలు అన్నీ కూడా పాలస్తీనా ప్రజల హక్కులకు పెరుగుతున్న అంతర్జాతీయ మద్దతును చూపుతున్నాయి.

UN-SC లో కాల్పుల విరమణ ప్రతిపాదనలు: 16 అక్టోబర్ 2023 నుండి 20 నవంబర్ 2024 వరకు UN భద్రతా మండలిలో 13 కాల్పుల విరమణ ప్రతిపాదనలు ప్రవేశపెట్టబడ్డాయి. అమెరికా నాలుగు ప్రతిపాదనలను వీటో చేసింది. మిగిలిన సభ్యులందరూ అనుకూలంగా ఓటు వేశారు, ఒకరిద్దరు గైర్హాజరయ్యారు.

నాలుగు ముసాయిదా తీర్మానాలు ఆమోదించబడ్డాయి. ఒకటి: సహాయం కోసం విరామాలకు, రెండవది: శాంతికి పరిస్థితులను సృష్టించడానికి, మూడవది: రంజాన్

చివరి రెండు వారాలలో శత్రుత్వాన్ని నిలిపివేయడానికి, నాల్గవది: మూడు దశల్లో కాల్పుల విరమణకు. ఈ నాలుగింటిలోచివరిది: నిజంగా కాల్పుల విరమణ కోసం, 2024 జూన్ 10న అమెరికా ప్రతిపాదించింది. ఇది ఆమోదించబడింది కానీ ఇజ్రాయెల్ చేత చెత్తబుట్టలో విసిరివేయబడింది.

యుఎన్–ఎస్సి ఓటింగ్స్, చర్చలు అమెరికా, ప్రపంచంలో దౌత్యపరంగా ఎలా ఒంటరిదయ్యిందో చూపుతున్నాయి. ఆ చర్చలన్నింటిలో ఇజ్రాయెల్, అమెరిక రాయబారులు చేసిన చాలా జుగుప్సాకర ప్రసంగాలను కూడా మనం చూడగలిగాము – రూపం, సారం రెండింటిలోనూ.

**ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ** (UNGA) **తీర్మానం**: 2024 మే 9 న అత్యవసర ప్రత్యేక సమావేశంలో, UN జనరల్ అసెంబ్లీ పాలస్తీనా దేశం UNలో పూర్తి సభ్యత్వానికి అర్హత కలిగి వుందని నిర్ణయించింది. ఈ విషయాన్ని అనుకూలంగా పునఃపరిశీలించాలని భద్రతా మండలికి సిఫారసు చేసింది (ఈ అంశంపై యుఎన్–ఎస్సి తీర్మానాన్ని అమెరికా మునుపు వీటో చేసినందున). 143 సభ్య దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయగా, అమెరికా, ఇజ్రాయెల్ మొదలైన 9 దేశాలు వ్యతిరేకంగా ఓటువేశాయి. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కూడా పాలస్తీనా హెూదాను ఐక్యరాజ్యసమితిలో 'పరిశీలనా దేశం' గా పెంచింది.

ఈ చర్య పాలస్తీనాకు మద్దతును, ఇజ్రాయెల్, అమెరికా దౌత్యపరమైన ఒంటరితనాన్ని సూచిస్తుంది. 1967 కి ముందు సరిహద్దుల ఆధారంగా పాలస్తీనా ప్రజలకు వారి స్వతంత్ర పాలస్తీనా రాజ్య హక్కుతో సహా స్వపరిపాలన చేసుకోనే హక్కును యుఎన్ జిఏ పునరుద్ఘాటించింది.

**ఐసిజె, ఐసిసి, హెచ్ఆర్డబ్ల్యు:** పాలస్తీనా భూములను ఇజ్రాయెల్ నిరంతరం ఆక్రమించడం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలపై అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) అభిప్రాయాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ కోరింది. జూలై 2024 లో ఐసిజె ఈ క్రింది విధంగా అభిప్రాయం/తీర్పును ఇచ్చింది:

"ఆక్రమిత పాలస్తీనా భూభాగం (ఒపిటి)లో ఇజ్రాయెల్ నిరంతర ఉనికి చట్టవిరుద్ధం. అన్ని కొత్త సెటిల్మెంట్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేసి, ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో స్థిరపడిన వారందరినీ తరలించాల్సిన బాధ్యత ఇజ్రాయెల్ దేశంపై వుంది. ఒపిటిలో తన చట్టవిరుద్ధ ఉనికిని వీలైనంత త్వరగా అంతం చేయాల్సిన బాధ్యత కూడా ఆ దేశానికి వుంది". ఈ విషయంలో ఇజ్రాయెల్ దేశానికి ఏ దేశం కూడా ఎటువంటి సహాయం అందించకూడదని అభిప్రాయపడింది.

"నాగరికమైన, చట్టాన్ని గౌరవించే" ఏ దేశానికైనా ఇంతకు మించి ఏం నిర్దేశించాలి?

గాజాలో ప్రస్తుత ఇజ్రాయెల్ దాడులను జాత్యహంకార నరమేధం "జెనోసైడ్"గా

ప్రకటించాలని దక్షిణాఫ్రికా ఐసిజెకు పిటిషన్ వేసింది. ఐసిజె విచారణలను పూర్తి చేసింది కానీ ఇంకా తన తీర్పును ఇవ్వలేదు.

**అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు:** (ఐ.సి.సి) 2024 నవంబర్ 21న బెంజమిన్ నెతన్యాహు , యోవ్ గాలంట్లకు మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరాలకు, 2023 అక్టోబర్ 8 నుండి జరిగిన యుద్ధ నేరాలకు సంబంధించి అరెస్టు వారెంట్లు జారీ చేసింది. నెతన్యాహు, యోవ్ గాలాంట్ (2024 నవంబర్ 6 వరకు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి) ఆకలిమంటలని యుద్ధ ఆయుధంగా వాడడం, మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన హత్యలు, హింస, ఇతర అమానవీయ చర్యలకు ఇద్దరూ బాధ్యులని విశ్వసించడానికి ఐసీసీ సహేతుకమైన ఆధారాలను కనుగొంది. ఈ ఇద్దరూ గాజా జనాభాకు ఆహారం, నీరు, మందులు, వైద్య సరఫరాలు, ఇంధనం, విద్యుత్తును నిరాకరించారు.

క్లుప్తంగా ఈ తీర్పు అర్థం ఏంటంటే నెతన్యాహు, యోవ్ గాలంట్ సామూహిక హంతకులు, ఘోరమైన యుద్ధ నేరస్థులు అని. ప్రపంచ ప్రజలు ఈ సాహసోపేతమైన, చట్టబద్ధమైన ఐసీసీ తీర్పును ఆచరణలో పెట్టి ఈ నరహంతకులకు తగిన శిక్షలు పడేలా ఒత్తిడి తేవాలి. అప్పుడే ఇలాంటి ఇతర దుర్మార్గులు వెనక్కు తగ్గుతారు.

హ్యూమన్ రైట్స్ వాచ్ (హెచ్ఆర్డబ్ల్యూ) అనేది మానవహక్కుల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి పనిచేస్తున్న ఒకపెద్ద స్వతంత్ర అంతర్జాతీయ సంస్థ. ఇది నవంబర్ 2024లో "నిరాశ, పస్తులు, ముట్టడి" – ఇజ్రాయెల్ చే గాజాలో పాలస్తీనియన్ల బలవంత స్థానభ్రంశం, అనే శీర్షికతో ఒక నివేదికను విడుదల చేసింది. దీనికై హెచ్ఆర్డబ్ల్యూ విస్తృతంగా ఇంటర్వ్యూలు, పరిశోధనలు నిర్వహించి ఈ క్రింది నిశ్చయానికి వచ్చింది.

"ఇజ్రాయెల్ అధికారులు అక్టోబర్ 2023 నుండి గాజాలో ఉద్దేశపూర్వకంగా, బలవంతంగా భారీగా పాలస్తీనా పౌరులను స్థానభ్రంశం చేశారు. యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు వారిదే బాధ్యత. గాజా జనాభా మొత్తాన్ని ఇజ్రాయెల్ తరచుగా బలవంతంగా చాలాసార్లు స్థానభ్రంశం చేయడాన్ని సమర్థించడానికి ఆమోదయోగ్యమైన అత్యవసర సైనిక కారణం ఏదీ లేదు. "ఇజ్రాయెల్‌కు ఆయుధాల అమ్మకాలను నిలిపివేయడానికి ప్రభుత్వాలు ఆంక్షలు, ఇతర చర్యలను అవలంబించాలి" అని హెచ్ఆర్డబ్ల్యూ సిఫార్సు చేసింది.

మరణించిన వారిలో 70 శాతం మంది మహిళలు, పిల్లలు అనీ, హమాస్‌తో లేదా కొనసాగుతున్న యుద్ధంతో సంబంధం లేనివారని వారి విస్తృత పరిశోధనలో తేల్చారు.

ఐసిజె, ఐసిసి, హెచ్ఆర్డబ్ల్యూ తీర్పులు, అభిప్రాయాలు, తీర్మానాలన్నీ ఒకేఒక విషయాన్ని సూచిస్తాయి. ప్రపంచ యుద్ధోన్మాది అమెరికా మద్దతు పొందుతున్న ఇజ్రాయెల్ యుద్ధోన్మాద, ఇతరులను ఇబ్బందిపెట్టి ఆనందపడే జాత్యహంకార దురాక్రమ వలస రాజ్యం.

**పాలస్తీనియన్లకు మద్దతుగా USA రెండు చర్యలు:** USA రెండు 'ముఖ్యమైన' చర్యలను చేపట్టింది. ఒకటి: వెస్ట్ బ్యాంకులో కొంతమంది ఇజ్రాయెల్ వలసవాసులపై ఆంక్షలు విధించడం, రెండవది: ఇజ్రాయెల్ భూ మార్గాల ద్వారా గాజాకు ఎటువంటి సహాయాన్ని అనుమతించడం లేదు కనుక మధ్యధరా సముద్రంలో తేలియాడే పీర్ను మోహరించడం.

మొదటి చర్య 'అన్యాయమైన' దని ఇజ్రాయెల్ కోపంగించుకుంది. అమెరికా నుండి సైనికపరంగా, ఆర్థికపరంగా, దౌత్యపరంగా గొప్ప సహాయాన్ని పొందుతూనే, అమెరికాకు ఎటువంటి సానుకూల ప్రచార సమయం ఇవ్వకుండానే ఈ సమస్య చాలా వేగంగా అంతరించింది.

ఫ్లోటింగ్ పీర్ అనేది దానిని నిర్మించడంలో, ఆపరేషన్ కోసం అమలు చేయడంలో ఒక సాంకేతిక ఘనత. కొన్నివారాల ఉపయోగం తరువాత అది విఫలమైంది. దానిని యు.ఎస్. నావికాదళం తీసివేయవలసి వచ్చింది. ఈ విఫల సాంకేతిక ప్రదర్శన కంటే అమెరికా, ఇజ్రాయెల్‌కు అన్ని మద్దతులు నిలిపివేస్తానని బెదిరించి వుంటే స్పృహలోకి వచ్చి, గాజాకు సహాయక మార్గాలు తెరిచి, ఎక్కువ సహాయక ట్రక్కులు గాజాలోకి వచ్చేలా చేసేది.

అమెరికా అందించిన ఆయుధాలు, మందుగుండు సామగ్రితో ఇజ్రాయెల్ హత్య చేసిన పాలస్తీనియన్ల (గాజాలో) ఆత్మలు వెంటబడకుండా వుంటాయని అమెరికా చేసిన ఈ రెండు చర్యలు ఎండమావులే అని తేలిపోయింది.

అమెరికా ఈ చర్యలు తన సూపర్ పవర్ హెూదాకు తగినవిగా కనిపించవు. మహా అయితే అవి నవ్వులపాలు అయ్యేవిగా వున్నాయి.

## 9. ఇండియన్ కనెక్షన్ :

"అలీన ఉద్యమం" సజీవంగా, బలంగా వున్నంత వరకు భారతదేశం చాలా కాలం పాటు పాలస్తీనాకు బలమైన మద్దతుదారుగా వుంది. ఐక్యరాజ్యసమితి పాలస్తీనియన్ల ప్రతినిధిగా పిఎల్ఓను ధృవీకరించిన తరువాత, 1974లో దానిని గుర్తించిన మొదటి దేశం మనదే. మళ్ళీ, 1988 నవంబరులో పాలస్తీనాను దేశంగా గుర్తించిన మొదటి కొన్ని దేశాలలో మనది ఒకటి.

తరువాత, పాలస్తీనా పోరాటాలు, నాయకులతో మన సంబంధాలు పేలవంగా మారాయి. ఇజ్రాయెల్‌తో వాణిజ్య, రక్షణ మార్పిడులు మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఫోన్ ట్యాపింగ్ టెక్నాలజీలు, ఇంటెలిజెన్స్ సేకరణ పరంగా ఇజ్రాయెల్‌తో ప్రధాన ఒప్పందాలు అనేక రెట్లు పెరిగాయి. హైఫా నౌకాశ్రయం అభివృద్ధి కాంట్రాక్టులను ఇజ్రాయెల్ అదానీ కంపెనీకి ప్రదానం చేసింది. రెండు దేశాల మధ్య సైనిక వాణిజ్యం

పెరిగింది. గాజాలో ప్రస్తుత "జెనోసైడ్" సమయంలో, భారతదేశం సాధారణంగా ఇజ్రాయెల్, అమెరికాలతో (ప్రధానంగా యుఎన్ ఓటింగ్ లలో) నిలబడింది.

సాధారణంగా దేశంలో, ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో నిరుద్యోగం చాలా ఎక్కువగా వుంది. ఇజ్రాయెల్ తన పాలస్తీనా శ్రామికులను, కార్మికులందరినీ చంపుతున్నందున యుపి రాష్ట్ర ప్రభుత్వం ఇజ్రాయెల్‌లో పనిచేయడానికి కార్మికులు, శ్రామికుల నియామకాలు చేపట్టింది. ఇతర దేశాలకు శాంతి గురించి భారత ప్రభుత్వం చేసిన పనికిమాలిన బోధనలు ప్రపంచంలో ఎవరికీ గుర్తు లేవు. ఆ ఉపదేశాలను ఎవరూ పట్టించుకోరు.

భారతీయ టీవీ ఛానళ్లు సాధారణంగా ఇజ్రాయెల్, గాజా యుద్ధ పరిణామాలను పట్టించుకోవు. ఒకవేళ ఏమన్నా చూపించాల్సి వస్తే పాలస్తీనియన్లపై దురాగతాలను ఏమాత్రం చూపించక, పాశ్చాత్య కథనాన్ని వారు గుడ్డిగా ప్రసారం చేస్తారు.

ఒక పెద్ద దేశంగా, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోరుకునే అభ్యర్థిగా, ఇజ్రాయెల్ అంతర్జాతీయ ఒప్పందాలను, మానవ హక్కుల ఉల్లంఘనలను వ్యతిరేకించడంలో భారతదేశం తన స్వతంత్ర వైఖరిని చూపించాలి. ఫాసిస్టు ప్రభుత్వాలకు మద్దతు ఇవ్వడం వల్ల ఇతర దేశాల నుండి మనకు ఎటువంటి గౌరవం లభించదు.

## 10. సారాంశం, ముగింపు :

జనసాంద్రత ఎక్కువగా వుండే ఒక చిన్న ప్రాంతం గాజాలో 44,750 మందికి పైగా చంపబడడం - వారిలో 70 శాతం మంది పిల్లలు, మహిళలు - 1,06,000 మంది గాయపడడం చాలా విషాదం. ఈ జాత్యహంకార నరమేధాన్ని సవాలు చేసి, దుష్ట దేశమైన ఇజ్రాయెల్‌ను శిక్షించే ఒక్క దేశం కూడా లేని ఈ ప్రపంచంలో జీవించడం పెద్ద విషాదం. ప్రపంచంలోనే అతిపెద్ద దుండగుడు అమెరికా, ఇజ్రాయెల్ కు మద్దతు ఇవ్వడం వల్ల ఎంతటి నేరం చేసినా శిక్ష ఉండదన్న అహంకారంతో విర్రవీగుతోంది.

చారిత్రాత్మకంగా యూదు వలసదారులకు బ్రిటిష్ మాండేట్ ప్రభుత్వం వలసవాద పాలన, రహస్య సైనిక సమూహాలను ప్రారంభించడానికి స్వేచ్ఛ ఇచ్చింది. 1947లో ఐక్యరాజ్యసమితి విభజన ప్రణాళిక ఇజ్రాయెల్ దేశాన్ని సృష్టించడం ద్వారా ఆక్రమణను క్రమబద్ధీకరించింది. దాని పర్యవసానంగా 'నక్బా' జరిగింది. దీనిలో ఇజ్రాయెల్ 7,00,000 మంది పాలస్తీనియన్లను వారి భూములు, గ్రామాల నుండి తరిమివేసింది. 1967 యుద్ధం ఫలితంగా ఇజ్రాయెల్ సైనిక ఆక్రమణలో దాదాపు 80 శాతం పాలస్తీనా భూమి, మిగిలిన 20 శాతం మాత్రమే పాలస్తీనా వెస్ట్‌బ్యాంక్, గాజా క్రింద వుంది.

ఇజ్రాయెల్ దురాక్రమణలు, హింస, యుద్ధాలు వెస్ట్ బ్యాంకును ఎటువంటి నిజమైన అధికారం లేని పాలస్తీనా అథారిటీకి, గాజాను పెద్ద బహిరంగ జైలుగా వదిలివేసాయి.

గాజాలో ఇస్లామిక్ రెసిస్టెన్స్ గ్రూప్ హమాస్ అధికారంలోకి రావడాన్ని సాకుగా చూపి ఇజ్రాయెల్ "ఆత్మరక్షణ" పేరిట అత్యంత ఘోరమైన ఆయుధాలతో, వైమానిక దాడులను సమర్థించుకోంటుంది.

ప్రపంచపు దుర్మార్గ దేశం USA సైనిక, ఆర్థిక, సైద్ధాంతిక, దౌత్య మద్దతు ఇచ్చి మధ్యప్రాచ్యంలో తన స్థానిక గూండా ఇజ్రాయెల్ ను నిలబెట్టుకుంటుంది. దాని సైనిక – పారిశ్రామిక సముదాయం, కార్పొరేట్ల రక్షణ; మధ్యప్రాచ్యంలో దాని చమురు ప్రయోజనాలు; దాని నియో–ఇంపీరియల్ ప్రయోజనాలు అమెరికా తన క్లయింట్ ఇజ్రాయెల్‌కు అన్ని నేరాలు చేసినా సహించడానికి, మద్దతు ఇవ్వడానికి నిజమైన కారణాలు. USA, ఇతర (అసలు యూదు వ్యతిరేక) యూరోపియన్ దేశాలు ఈ అన్యాయాన్ని దాచలేకపోయాయి. ఐక్యరాజ్యసమితి, ఐసీసీ, ఐసీజే, హెచ్ఆర్డబ్ల్యూ, దాదాపు 20 దేశాలు కొనసాగుతున్న మారణహోమాన్ని ఖండించాయి, పాలస్తీనా ఆకాంక్షకు మద్దతు ఇచ్చాయి.

భారతదేశం, "శాంతి" గురించి ఎంత అరిచినప్పటికీ భౌతికంగా కార్మికులను పంపడం ద్వారా ఇజ్రాయెల్‌కు గట్టిగా మద్దతు ఇస్తుంది. అమెరికాను సంతోషపెట్టడానికి, ఇజ్రాయెల్ చేసిన అన్ని నేరాలకు మద్దతు ఇచ్చేంత దిగజారకూడదు.

ఈ చరిత్రలో చాలామంది ప్రధాన ప్రతినాయకులు వున్నారు. బాల్ఫోర్ (యుకె), బెన్–గురియన్, జోర్డాన్ రాజు హుస్సేన్, ఇజ్రాయెల్ వివిధ ప్రధానమంత్రులు. అమెరికా వివిధ అధ్యక్షులు (నిక్సన్, బుష్, క్లింటన్, ఒబామా, బైడెన్ పెద్ద సహకారం అందిస్తున్నారు), యుకె, జర్మనీ, ఫ్రాన్స్ , సౌదీ అరేబియా అగ్ర నాయకులు. ఈ ప్రతినాయకులను శిక్షించే బలమైన సామ్యవాద దేశం ప్రపంచంలో లేదు అనేది విచారకరం. అత్యంత దుష్ట, ద్వేషపూరిత మూరు?డు ఇజ్రాయెల్ ప్రస్తుత ప్రధాని నెతన్యాహు. ప్రతినాయకులలో చనిపోయిన వారందరూ పోయి ప్రపంచానికి చాలా మంచిచేసారు. బ్రతికున్నవారు చంపబడటానికి అన్ని విధాలా అర్హులు.

మార్క్సిస్ట్ , జియోనిస్ట్ వ్యతిరేక 'సోషలిస్ట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇజ్రాయెల్ ""మాట్జెన్" ఒకసారి ఇలా వ్రాసింది. "ఆక్రమణ విదేశీ పాలనను తెస్తుంది. విదేశీ పాలన ప్రతిఘటనను తెస్తుంది. ప్రతిఘటన అణచివేతను తెస్తుంది. అణచివేత ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదం ఉగ్రవాదంపై ఉగ్రవాదాన్ని ....". ఇజ్రాయెల్ అక్రమ ఆక్రమణలో వున్న పాలస్తీనియన్ల గత డెబ్బై ఐదు సంవత్సరాల చరిత్రలో మనం చూస్తున్నది ఇదే. దీనికి ముగింపు పలకాలి. పాలస్తీనా భూభాగంలో మానవ హక్కుల పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక రిపోర్టర్ నివేదిక ముగింపు ఇలా వుంది – "గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చేస్తోన్న మారణహోమం సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వలసవాద నిర్మూలన ప్రక్రియ యొక్క ఉచ్ఛ దశ". ఏడు దశాబ్దాలకు పైగా ఈ ప్రక్రియ పాలస్తీనా ప్రజలను జనాభాపరంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఒక సమూహంగా ఉక్కిరిబిక్కిరి చేసింది.

పాలస్తీనా ప్రజలను స్థానభ్రంశం చేయడానికి, దాని భూమి, వనరులను స్వాధీనం చేసుకోవడానికి , నియంత్రించడానికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోంది. కొనసాగుతున్న నక్బాను ఆపి, శాశ్వతంగా పాలస్తీనా సమస్యను పరిష్కరించాలి. ఈ విషాద బాధితులకు, భవిష్యత్తు తరాలకు ఇది తప్పనిసరి".

ఇజ్రాయెల్ పాలస్తీనాకు ముప్పు, మానవ హక్కులకు ముప్పు, ప్రపంచంలో శాంతికి ముప్పు. అందుకే 'ఇజ్రాయెల్ ముప్పు' ను తొలగించాల్సిన 'చారిత్రక బాధ్యత' వుంది. ఈ ముప్పును ఎలా, ఎప్పుడు, ఎవరి ద్వారా తొలగించాలో పాలస్తీనియన్లు, అరబ్బులు, అరబ్ దేశాలు, ప్రపంచంలోని ఇతర ప్రగతిశీల దేశాలు నిర్ణయిస్తాయి.

కానీ ప్రస్తుతానికి నాగరిక పాలస్తీనా, ఇజ్రాయెల్ ప్రజలు నెతన్యాహును ఎదుర్కోవడం అత్యవసరం.


Mandatory Palestine
1947 UN Partition Plan
1948 - 1967
2020
Mediterranean Sea
Dead Sea
Sea of Galilee
Gulf of Aqaba
JORDAN
EGYPT
Akka
Haifa
Nazareth
Jenin
Nablus
Tel Aviv
Jaffa
Ramallah
Jericho
Jerusalem
Bethlehem
Hebron
Gaza
Khan Yunis
Bir-es-Saba
33°N
32°N
31°N
30°N
35°E

**PALESTINA MUKHACHITRAM**

*Gaajapai Israel Daadulu 2023-2024*





ప్రచురణ

**రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్)**

AIKMKS అనుబంధం